మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## అలాయ్-బలాయ్‌కు భారీగా తరలిన కాంగ్రెస్ నాయకులు



**జోగిపేట,అక్టోబర్ 14, ప్రభాతవార్త:** జోగిపేట పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకులు భారీ ఎత్తున కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన అలాయ్-బలాయ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్ర వైద్యఆ రోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహ ఆధ్వర్యంలో చౌటకూరు మండలం తాడ్‌దాన్‌పల్లి ఎక్స్‌రోడ్డు వద్ద ఉన్న ఫంక్షన్‌హాలులో సోమవారంనాడు దసరా పండగను పురస్కరించుకొని అలాయ్-బలాయ్ కార్యక్రమం నిర్వహించారు. మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపేందుకు పెద్దఎత్తున కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. అందులోభాగంగా జోగిపేట పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు ఎస్.క్రిష్టారెడ్డి, డాకూరి వెంకటేశం, గొల్ల శరత్‌బాబు, కొశికె రాజశేఖర్, గొల్ల శరత్‌బాబు పాల్గొన్నారు.

## స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే గాంధీ

**కొమురవెల్లి, అక్టోబర్ 14, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామిని (పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్) శేర్‌లింగంపల్లి ఎమ్మెల్యే ఆర్కేపుడి గాంధీ సోమవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ వర్గాలు స్వామివారి శేష వస్త్రములు, ప్రసాదం, స్వామి వారి చిత్ర పటాన్ని అందజేశారు. కార్యక్రమం లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్, సార్ల లింగం, ఎల్లయ్య యాదవ్, వంశీకృష్ణ, బత్తిని నర్సింలు,కోల్బాయ్ కనకయ్య, శ్రీనాథ్, చింతల రమేష్ తదితరులు ఉన్నారు.



పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే ఆర్కేపుడి గాంధీకి స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం



మాజీ మంత్రి హరీష్‌రావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఆదర్శ్‌రెడ్డి

## మాజీ మంత్రికి ఆదర్శ్‌రెడ్డి శుభాకాంక్షలు

**రామచంద్రాపురం, అక్టోబరు 14, ప్రభాతవార్త:** దసరా పండగ ముగియడంతో సోమవారం బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి మాజీ మంత్రి, సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రా వుకు దసరా పండగ శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం హైద్రాబాద్ లోని హరీష్‌రావు నివాసంలో ఆదర్శ్‌రెడ్డి హరీష్‌రావును మర్యాద పూర్వకంగా కలుసుకుని పండగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పటాన్‌చెరు నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

## సన్న రకం వరి ధాన్యానికి బోనస్ : అదనపు కలెక్టర్



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న అడిషన్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

**కొండపాక, అక్టోబర్ 14, ప్రభాతవార్త** ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. సోమవారం కొండపాక మండల పరిధిలోని రాంపల్లిలో ఐకెపి మహిళా సంఘాల అధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డిఆర్‌డిఒ జయదేవ్ అర్యతో కలిసి అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు అరబెట్టిన ధాన్యాన్ని శుద్దిచేసి కొనుగోలు కేంద్రానికి తీసుకు రావలన్నారు. ప్రభుత్వ కనీస మద్దతు ధర ఎ గ్రేడ్ ధాన్యానికి రూ॥ 2320, కామన్ గ్రేడ్ రకానికి రూ॥ 2300లు చెల్లించడం జరుగుతుందన్నారు. సన్న రకం వరి ధాన్యానికి కొనుగోలు కేంద్రంలో రూ॥ 500 అదపంగా ప్రభుత్వం బోనస్ చెల్లిస్తుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రానికి రైతులు తమ వెంట బ్యాంకు ఖాతా పాస్ బుక్ జిరాక్స్, అధార్ కార్డు జిరాక్స్, వ్యవసాయ శాఖ అధికారి దృవీకరించిన పంట సాగు దృవీకరణ పత్రాలు తెచ్చి, కొనుగోలు కేంద్రం నిర్వహకులకు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకటేశ్వర్లు, ఎఒ శివరామకృష్ణ, ఎపిఎం మగ్దుం అలీ, గ్రామ ప్రత్యేకధికారి, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు సురేందర్‌రెడ్డి, రైతులు, సిసిలు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గామాత శోభాయాత్రలో ఎమ్మెల్యే ఎంజీఆర్



దుర్గామాత శోభాయాత్రలో ఎమ్మెల్యే ఎంజీఆర్

**పటాన్‌చెరు,అక్టోబర్ 14,ప్రభాతవార్త:** శ్రీ దేవి శరన్నవరాత్రులను పురస్కరించుకొని పటాన్‌ఛెరు డివిజన్ పరిధిలోని గోనెమ్మ బస్తీ, రామేశ్వరం బండ,జిహెచ్ఎంసి కాలనీలో ఏర్పాటు చేసిన దుర్గామాత శోభాయాత్రలలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హజరయ్యారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కరుణాకటాక్షాలతో ప్రజలందరూ సుఖశాంతులతో అయురారోగ్యాలతో ఉండాలని కొరుకున్నట్లు తెలిపారు. హాజరైన మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ సర్పంచి అంతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీనే కార్యకర్తలకు అండ

-మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



పార్టీ ఇన్సూరెన్స్ చెక్కులను అందజేస్తున్న పద్మాదేవేందర్‌రెడ్డి

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 14 ప్రభాతవార్త:** పార్టీ కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని మెదక్ మాజీ ఎమ్మెల్యే, జిల్లా పర్టీ అధ్యక్షురాలు ఎం. పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. మెదక్ జిల్లా హవేళీఘనపూర్ మండలం శమ్నాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కర్యర్త బుస్సా స్తయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించారు. అదేవిధంగా మెదక్ మండలం రాజ్‌పల్లి గ్రామానికి చెందిన మార్గం యాదగిరి ఇటీవల విద్యుత్ షాక్ ప్రమాదంలో మరణించాడు. ఇద్దరికీ పార్టీ సభ్యత్వం ఉండటంతో ప్రమాద భీమ ద్వారా మంజూరైన 2 లక్షల రూపాయల చొప్పున ఇద్దరికీ రూ.4 లక్షల విలువ గల పార్టీ ఇన్సూరెన్స్ చెక్కులను సత్తయ్య సతీమణి బుస్సా మత్యాలుకు, యాదగిరి సతీమణి మార్గం లక్ష్మీలకు సోమవారం పార్టీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం కలిగిన కార్యకర్తలకు ప్రమాదవశాత్తు ఏమైనా జరిగితే వారి కుటుంబానికి అండగా ఉండటానికి ప్రమాద భీమా సౌకర్యం కల్పించారన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎం. దేవేందర్‌రెడ్డి, హవేళీఘనపూర్, మెదక్ మండలాల పార్టీ అధ్యక్షులు సీహెచ్. శ్రీనివాస్‌రెడ్డి, అంజాగౌడ్, మాజీ జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు ఎం. లావణ్యరెడ్డి, మెదక్ మాజీ వైసీపీ మార్గం ఆంజనేయులు, శమ్నాపూర్ మాజీ సర్పంచి లింగం, మాజీ వైస్ ఎంపీపీ రాధాకిషన్ యాదవ్, నాయకులు కిష్టయ్య, రాజు, శ్రీనివాస్, రామచంద్రారెడ్డి, సతీష్‌రావు, రాజేశ్వర్ రావు, యువ నాయకులు వినయ్, అనిల్, హరీష్, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలను విస్మరిస్తే మనుగడ అసాధ్యం

-కులాల గణనతోనే రాజకీయ అవకాశాలు
-వెయ్యి కోట్లతో అందోలు అభివృద్ధి
-రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా



అలైబలై కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహా

**చౌటకూరు, అక్టోబరు 14, ప్రభాతవార్త:** కార్యకర్తలను విస్మరిస్తే నాయకులకు మనుగడ అసాధ్యమని, కార్యకర్తల కష్టంతోనే నాయకులకు గుర్తింపు దక్కుతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి దామోదర్ రాజనర్సింహా అన్నారు. దసరా పర్వదినం ముగిసాక సంగారెడ్డి జిల్లా చౌటకూరు మండల పరిధిలోని సుల్తాన్‌పూర్ గ్రామ శివారులో ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నత్తి దశరథ్ అధ్యక్షతన నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఇటీవల జరిగిన శాసన సభ ఎన్నికల్లో కార్యకర్తల కష్టంతోనే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. ఇది మాల, మాదిగల పంచాయితీ కాదని, ఈ కులాల్లో ఉన్న వెనుకబాటుతనాన్ని గుర్తించి జనాభా ప్రతిపాదికన సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఆ కులాలను గణన చేపట్టి సాంస్కృతిక పరంగా బేరీజు వేసి న్యాయం చేయాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. అన్ని వర్గాలకు సరైన గుర్తింపు రావాలంటే కులగణనతోనే సాధ్యం అవుతుందన్నారు. శాసన సభ ఎన్నికల సందర్భంగా చేసిన హామీలను అంచెలంచెలుగా అమలు చేస్తున్నామన్నారు. 6 గ్యారంటీల్లో ఆర్టీసిలో మహిళలకు ఉచిత ప్రయాణం, ఎపేదలకు ఉచితంగా 200 యూనిట్ల విద్యుత్ సరఫరా, ఆరోగ్య శ్రీ పథకాన్ని 10 లక్షలకు పెంచడం, రుణమాఫీ లాంటి సంక్షేమ పథకాలను అమలు చేశామన్నారు. రానున్న మూడు నెలల్లో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని పదవులను కాంగ్రెస్ కైవశం చేసుకునేలా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అభివృద్దే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తోందని పేర్కొన్నారు.ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ వేస్తామని హామి ఇచ్చామని, ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఇప్పటికే 30 వేల ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు నియమించారన్నారు.



అలయ్‌బలయ్ కార్యక్రమానికి హాజరైన నియోజకవర్గం పార్టీ నాయకులు

### వేయి కోట్లతో అందోల్ అభివృద్ది

వేయి కోట్ల రూపాయలతో అందోలు నియోజకవర్గంలో అభివృద్ది పనులు చేపడుతున్నామని మంత్రి దామోదర్‌రాజనర్సింహా పేర్కొన్నారు. బోరంచ ఎత్తిపోతలు, రాయికోడ్ చౌరస్తా నుంచి 5వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాం నిర్మాణం, చిలప్‌చెడ్ మండలం అజ్జమర్రి మీదుగా నర్సాపూర్ నియోజకవర్గానికి రోడ్డు కనెక్టివిటీ కోసం మంజీర నదిపై వంతెన నిర్మాణం చేపడుతున్నామన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో 125 కోట్లతో బస్వాపూర్ గ్రామ శివారులో సమీకృత గురుకుల పాఠశాల, జోగిపేటలో నర్సింగ్ కళాశాల, సింగూరు కెనాల్ సీసీ లైనింగ్, 150 పడకల ఆసుపత్రి నిర్మాణం, సుల్తాన్‌పూర్ వద్ద జేఎన్‌టీయులో సైన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నామని మంత్రి ప్రకటించారు.

### కార్యకర్తలతో అలయ్‌బలయ్...

నియోజకవర్గంలోని టేక్మాల్, అల్లాదుర్గ, రేగోడ్, రాయికోడ్, మునిపల్లి, అందోల్, పుల్కల్, చౌటకూరు, వట్‌పల్లి మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కార్యక్రమానికి తరలిరాగా మంత్రి దామోదర్ రాజనర్సింహా వారితో అలయ్ బలయ్ చేసుకుంటూ పండగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డిసిసిబీ మాజీ డైరెక్టర్ రామచంద్రారెడ్డి, పుల్కల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దుర్గారెడ్డి, మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య, నాయకులు సురేందర్‌గౌడ్, మల్లారెడ్డి, రాములు, గోవర్ధన్, లక్ష్మారెడ్డి, ఈశ్వర్‌గౌడ్, శ్రీనివా స్‌రెడ్డి, సార గోవర్ధన్ ముదిరాజ్, వర్కల రమేష్, రామాగౌడ్, కైసర్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యధేచ్ఛగా ఓదెం చెరువు శిఖం భూమి కబ్జా

కన్నెత్తి చూడని రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులు
మంత్రి ఆదేశించినా అధికారుల్లో కానరాని చలనం
ప్రజాప్రతినిధుల అండతోనే కబ్జా అంటున్న అధికారులు



కవలంపేట ఓదెం చెరువులో నిర్మించిన రోడ్డు

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 14 ప్రభాతవార్త:** కబ్జాకు కాదేది అనర్హం అన్నట్లుగా చెరువు శిఖం భూమిని అక్రమార్కులు యధేచ్ఛగా కబ్జా చేసి రోడ్డు నిర్మించినా సంబంధజత అధికారులు కళ్లు లేని కబోదులుగా చూస్తూ ఉండిపోయారు. కబ్జా చేసింది ఒకటి రెండు ఎకరాల భూమి కాదు, ఏకంగా 60 ఎకరాల వరకు ప్రభుత్వ భూమిని కబ్జా చేసుకున్న సంఘటన మండల పరిధిలోని కవలంపేట గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి పూర్తి వివవారల్లోకి వెళితే... కవలంపేట గ్రామ శివారులోని సర్వే నంబర్ 138లో 59ఎకరాల 30 గుంటల విస్తీర్ణంలో ఉన్న ఓదెం చెరువు భూమిని కొందరు అక్రమార్కులు వెంచర్ నిర్వాహకులు ఏకంగా 100 ఫీట్ల రోడ్డు నిర్మాణం చేపట్టారు. వెంచర్ నిర్మాణానికి అనుమతులు ఎలా ఇచ్చారో, ప్రభుత్వ స్థలంలో రోడ్డు నిర్మస్తున్నా అధికారులకు పట్టించు కోకపోవడాన్ని పరిశీలిస్తే పలు అనుమానా లకు తావిస్తోంది. చెరువు శిఖం భూమి కబ్జాకు గుర యింది ఏ మారుమూల గ్రామంలో కాదు, జిల్లా కేంద్రమైన సంగారెడ్డి నియో జకవర్గంలో జాతీయ రహదారికి కూతవేటు దూరంలో కావడం గమనార్హం. యదేశ్చగా అక్రమణ జరుగుతున్నా పట్టించుకోవడం లేదేంటని ఓ అధికారిని ప్రభాతవార్త గుర్తు చేస్తే ప్రజాప్రతినిధులు, నాయకులు ఒత్తిడి అంటూ పేరు చెప్పేందుకు ఇష్టపడని అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలని పలు మార్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి దామోదర్ రాజనర్సింహా జిల్లా అధికారులకు సూచించినా ప్రయోజనం లేకుండా పోతోంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి అక్రమణకు గురైన చెరువు శిఖం భూమిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఏ మేరకు స్పందిస్తారో వేచి చూడాల్సిందే....



అల్లాదుర్గంలో మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు భవనం

## ప్రారంభోత్సవానికి నోచుకోని కోర్టు భవనం

భవనం నిర్మించి ఏడాది పూర్తి
అలంకారప్రాయంగా మున్సిఫ్ కోర్టు భవనం

**అల్లాదుర్గం, అక్టోబరు 14, ప్రభాతవార్త:** లక్షల రూపాయలు వెచ్చించి మరమ్మతులు చేపట్టిన కోర్టు భవనం ఏడాది గడుస్తున్న ప్రారం భోత్సవానికి నోచుకోలేక అలంకారప్రాయంగా మారింది. ఇందుకు సం బంధించి పూర్తి వివరాల్లోకి వెళితే...మండల కేంద్రమైన అల్లాదుర్గంలో నూతనంగా మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టును మంజూరు చేశారు. గ్రామం లోని ఎస్సీ బాలికల వసతి గృహంలో కోర్టు భవనాన్ని ఉపయోగించుకోవాలని జిల్లా అధికారులు సంకల్పించి భవనానికి అవసరమైన మరమ్మత్తు పనులు 20లక్షల రూపాయలతో చేయించారు. కోర్టు భవనం అన్ని హంగులతో ఉన్నా భవనాన్ని మాత్రం అధికారులు ఉపయోగించుకోవడం లేదు. అల్లాదుర్గంలో కోర్టు పనులు కొనసాగితే అల్లాదుర్గం, రేగోడ్, వట్‌పల్లి, పెద్ద శంకరంపేట, టేక్మాల్ మండలాల ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుంది. కోర్టు భవనాన్ని ప్రారంభించేందుకు అధికారులు రేపు మాపు అంటూ కాలాన్ని వెళ్లదీస్తూ వస్తున్నారు. కోర్టు భవనాన్ని ప్రారంభించి ప్రజలు కోర్టు సేవలు అందుకునేలా చర్యలు తీసుకోవాలని ఆయా మండలాల ప్రజలు సూచిస్తున్నారు.

# శానిటేషన్ పకడ్బంధీగా అమలు చేయాలి





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

జిల్లాలో రెండు రోజుల్లో ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు
గ్రామ సభల ద్వారా అర్హుల గుర్తింపు : కలెక్టర్

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 14 ప్రభాతవార్త:** దసరా సెలవుల అనంతరం ప్రభుత్వ, అన్ని సంక్షేమ పాఠశాలలు, వసతి గృహాల్లో పాఠశాలలు పున:ప్రారంభమవుతున్న తరుణంలో శానిటేషన్‌పై చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా అభివృద్ధి, సంక్షేమంపై పలు శాఖల అధికారులకు సూచనలు ఇస్తూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ప్రజలకు అందించేందుకు అధికారులు చొరవ చూపాలని, దసరా సెలవులు ముగించుకొని జిల్లాలో ప్రభుత్వ, సంక్షేమ పాఠశాలలు, వసతి గృహాలు ప్రారంభమవుతున్న తరునంలో ఫ్రైడే డ్రైడేగా చేపట్టి పరిసరాల పరిశుభ్రతపై చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో పలు శాఖలకు సంబంధించిన ఫైల్స్ ఈ ఆఫీస్ విధానం పకడ్బంధీగా అమలు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఫైల్ ఈ ఆఫీస్ ద్వారానే రావాలని, మాన్యువల్ ఫైల్స్ చూడటం జరగదని కలెక్టర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఇందిరమ్మ కమిటీల ఏర్పాటులో భాగంగా అకాల వర్షాల వలన కూలి పోయిన ఇండ్లకు, మొత్తంగా ఇండ్లు లేని అర్హులైన నిరుపేదలను గుర్తించి రిజర్వేషన్ ప్రతిపాదికన వారికి మొదటి ప్రాధాన్యతగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని, ప్రతి గ్రామ పంచాయితీలో గ్రామ సభ నిర్వహించి అర్హత గల లబ్ధిదారులను ఎంపిక చేసి కేటాయింపు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామ పంచాయితీ, మున్సిపల్ పరిధిలో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని కోరారు. ముఖ్యంగా మండల ప్రత్యేక అధికారులు ఇందిరమ్మ కమిటీల మార్గదర్శకాలను చదవాలని సూచించారు. ఇందిరమ్మ పథకం కింద ఒక్కో నియోజకవర్గానికి 3500 ఇండ్లను కేటాయించినట్లు ఆయన స్పష్టం చేశారు. ఎంపికైన లబ్ధిదారులకు మూడు దశల్లో 5 లక్షలను ప్రభుత్వం చెల్లించనుందని తెలిపారు. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్‌డీవో ఈడీ శ్రీనివాసరావు, సంబంధిత ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

అదనపు కలెక్టరు చంద్రశేఖర్



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టరు చంద్రశేఖర్

**నారాయణఖేడ్, అక్టోబరు 14 ప్రభాతవార్త:** విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టరు చంద్రశేఖర్ అన్నారు. సోమవారం నారాయణఖేడ్ మండల పరిధిలోని సంజీవన్‌రావుపేట గ్రామాన్ని సందర్శించారు. గత రెండు మూడు రోజులుగా గ్రామంలో కలుషిత నీరు తాగి ఇద్దరు మృతి చెంది పలువురు అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు. దీంతో అదనపు కలెక్టరు గ్రామాన్ని సందర్శించి గ్రామస్థులతో మాట్లాడారు. గ్రామంలోని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టరు దృష్టికి గ్రామంలోని సమస్యలను గ్రామస్థులు కలెక్టరుకు విన్నవించారు. గ్రామంలో గల బావిని సందర్శించి ఇలాంటి సమస్యలు మారెప్పుడు పునరావృత్తం కాకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. గ్రామంలో కలుషిత నీరు తాగడం వల్లనే ఈ పరిస్థితి నెలకొందన్నారు. మిషన్ భగీరత ఇంటింటికి నీరు రాక పోవడంతో గ్రామంలోని బావి చాలా సంవత్సరాల నుంచి ఉపయోగంలో లేక పోవడంతో కలుషితం నీరు తాగి అస్వస్థతకు గురయ్యారని గ్రామస్థులు తెలిపారు. అస్వస్థ తకు గురైన వారిని సంగారెడ్డి, నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతున్నారన్నారు. ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్న వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులకు సూచించారు. అధికారులపై జిల్లా కలెక్టరుకు నివేదిక పంపిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ అశోక చక్రవర్తి ,తదితరులు పాల్గొన్నారు.

# దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

అధికారులకు ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు సూచన



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 14 ప్రభాతవార్త:** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తుల సత్వర పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ అన్నారు. సోమవారం సమీకృత కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి వినతులు స్వీకరించి సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పలు సమస్యలతో కూడిన 35 దరఖాస్తులు వచ్చాయని, రైతు రుణమాఫీ-2, భూ సమస్యలు-15, పింఛన్లు-1, డబుల్ బెడ్‌రూం ఇండ్లు-1, ఇతర సమస్యలు-16 ప్రజావాణిలో వచ్చాయని తెలిపారు. వచ్చిన ప్రతి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖలు పరిష్కరించాలని ఆదేశించారు. దరఖాస్తులు పరిష్కారానికి కృషి చేయాలన్నారు. దరఖాస్తు పరిష్కార వివరాలు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస రావు, జెడ్పీ సీఈవో ఎల్లయ్య, జిల్లా పంచాయతీ అధికారి యదయ్య, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్, విద్యాశాఖ అధికారి రాధాకృష్ణ, సంబంధిత ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### సిద్దిపేట కలెక్టరేట్‌లో..

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజావాణిలో స్వీకరిం చిన ధరఖాస్తులను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేయొద్దని త్వరగా పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి అనేది గొప్ప కార్యక్రమం అని సామాన్యులకు అందుబాటులో ఉండి తమ సమస్యలను విన్నవించుకుని పరిష్కరిం చుకోవడానికి ఒక చక్కని వేదిక అన్నారు. దరఖాస్తులను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తే సహించేదిలేదన్నారు. కార్యక్రమంలో డిఆర్వోఓ నాగరాజమ్మ,డిఆర్‌డిఎ పిడి జయదేవ్ అర్యా, వివిధశాఖల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న దృశ్యం

## ఉరి వేసుకొని మాజీ వార్డు సభ్యులు గోపాల్ మృతి

**కొల్చారం, అక్టోబర్ 14 ప్రభాతవార్త:** ఉరి వేసుకొని మాజీ వార్డు సభ్యులు మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన కొల్చారం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. మృతుడు దోమకొండ గోపాల్ (వృత్తి రీత్యా తాపీ మేస్త్రీ పనులు చేస్తూ, అలాగే వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగించేవాడు. ఒకసారి కొల్చారం గ్రామ పంచాయితీ వార్డు సభ్యులుగా పని చేశారు. వ్యవసాయానికి చేసిన అప్పుల భారం పెరిగిపోవడంతో మనస్థాపం చెంది ఎవరూ లేని సమయంలో అతని వ్యవసాయ క్షేత్రంలోని గుడిసెలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్థులు తెలిపారు. మృతుడికి భార్య పద్మతో పాటు ఓ కూతురు ఉన్నారు. మృతుడు దోమకొండ గోపాలను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని ప్రజలు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## పాతబస్తీలో విద్యుత్ శాఖ అధికారుల బదిలీలు

**చార్మినార్, అక్టోబరు 14 ప్రభాతవార్త:** హైదరాబాద్ పాత బస్తీ టిజిఎస్‌పిడిసిఎల్ చార్మినార్ డివిజనల్ పరిధిలో విధులు నిర్వహించిన విద్యుత్ శాఖకు చెందిన పలువురు విద్యుత్ అధికారులు బదిలీ అయ్యారు. పాతనగరంలో అత్యంత కీలకమైన టిజిటిఎస్‌పిడిసిఎల్ చార్మినార్ డిఈగా మూడుసంవత్సరాలపాటు విధులు నిర్వహించిన టి. లింగయ్యగౌడ్ కీసర డివిజనల్ ఇంజనీరుగా బదిలీ అయ్యారు. ప్యారడైజ్ డిఈగా పనిచేసిన ఎం.శ్రీధర్ చార్మినార్ డిఈగా సోమవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా చార్మినార్ నూతన డిఇ ఎం.శ్రీధర్ మాట్లాడుతూ పాత బస్తీలోని విద్యుత్ వినియోగదారులకు సకాలంలో విద్యుత్ సరఫరా జరిగేలా అన్ని విధాల కృషి చేస్తానని తెలిపారు. కాగా చార్మినార్ ఎడిగా పని చేసిన విజయ్‌కుమార్ కులకర్ణికి డిఇగా పదోన్నతి లభించింది. డిఇగా పదోన్నతి పొందిన విజయ్ కుమార్ వికారాబాద్(డిపి) డిఇగా బదిలీ అయ్యారు. గాంధీనగర్ ఎడిఇ సయ్యద్ మక్సూద్ చార్మినార్ ఎడిఇగా నియమితులయ్యారు.

చార్మినార్ ఎఇ మహ్మద్ జాఫర్ షేక్‌పేట్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో చార్మినార్ ఎఇగా బంజారాహిల్స్‌లో ఎఇగా విధులు నిర్వహిస్తున్న మహమూద్ నియమితులయ్యారు. మొగల్‌పుర ఎఇ పిఎల్‌ఎన్ రాజు మోతీనగర్ ఎఇగా బదిలీ అయ్యారు. పాతబస్తీలో పెద్ద ఎత్తున విద్యుత్ శాఖ అధికారుల బదిలీలు జరిగాయి. కాగా చార్మినార్, ఫలక్‌నుమా సిబిడి ఎడిఇలు ఇద్దరు బదిలీ అయ్యారు. టిజిఎస్‌పిడిసిఎల్ చార్మినార్ సిబిడి ఎడిఇగా పని చేసిన మహ్మద్ అఫ్జల్ సౌత్ జోన్ ఎస్ఈ కార్యాలయానికి, ఫలక్‌నుమా సిబిడి ఎడిఇ మధుసూదన్‌రెడ్డి సైఫాబాద్ ఎడిఇగా బదిలీ అయ్యారు.

కాగా చార్మినార్ సిబిడిలో ఏఈలుగా విధులు నిర్వహిస్తున్న మహ్మద్ అక్బర్, ఠాకూర్ రంజిత్ సింగ్‌లు ఎడిఈలుగా పదోన్నతి పొందారు. చార్మినార్ సిబిడి ఏడిఈగా మహ్మద్ అక్బర్, ఫలక్‌నుమా సిబిడి ఏడిఈగా ఠాకూర్ రంజిత్ సింగ్ నియమితులయ్యారు. వీరితో పాటు పాతబస్తీలో విధులు నిర్వహిస్తున్న విద్యుత్ శాఖకు చెందిన పలువురు ఏఈలు బదిలీ అయ్యారు.

## హక్కుల సాధనకు ఉద్యమాలే శరణ్యం

**చిక్కడపల్లి, అక్టోబరు 14 ప్రభాతవార్త:** కల్లుగీత వృత్తిలో ఉపాధి, ఆధునీకరణకు అవకా శాలు అంశాలపై రాజకీయ పార్టీలకతీతంగా సమీకరించి హక్కుల సాధనకు ఉద్యమాలే శరణ్యమని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మేకపోతుల వెంకటరమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. సోమవారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘం 67వ వార్షికోత్స వాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్ప డిన తర్వాత పది సంవత్సరాల కాలంలో కల్లుగీత కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం తమ సంఘం కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా సమస్యల సాధనకు సభలు, సమావేశాలు, ధర్నాలు, బహిరంగ సభలు, నిరాహారదీక్షలులాంటి కార్యక్ర మాలు చేపట్టామని, ఫలితంగా కొన్ని హక్కులు సాధించకున్నామన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న జయంతి, వర్ధంతులను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం, ట్యాంక్‌బండ్‌పై పాపన్న విగ్రహం పెడతామని, జనగామ జిల్లాకు పాపన్న జిల్లా పేరు పెడతామని చెప్పటం పోరాట విజయమేనని అన్నారు. వృత్తిపన్ను రద్దు, ఎక్స్‌గ్రేషియా, పెన్షన్ పెంపు, నీరా ప్రాజెక్టు, ప్రమాదాలకు గురైన వారికి కార్పొరేషన్ ఆర్థిక సహకారం అందించడం, కాట మయ్య రక్షణ కవచం లాంటివి సాధించకున్నామ న్నారు. ఆయా సమస్యల సాధన కోసం అక్టోబరు 18న కల్లుగీత కార్మిక సంఘం 67వ వార్షికోత్సవా లను సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహించాలని నిర్ణయించామని, ఈ సందర్భంగా 'తెలంగాణలో పదేండ్ల ప్రయాణం-కల్లుగీత వృత్తిలో ఉపాధి' అంశంపై రాష్ట్ర సెమినార్ ఉంటుందన్నారు. వార్షికోత్సవాలకు ముఖ్యఅతిథులుగా రాష్ట్ర పర్యా టక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ సం క్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, పూర్వ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, టీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్, బీసీ కమిషన్ సభ్యులు రంగు బాలలక్ష్మి, టాడీ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్‌తో పాటు వివిధ గౌడ కల్లుగీత సంఘాల నాయకులు హాజరవుతారన్నారు. ఈసమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.వెంకటనర్సయ్య పాల్గొన్నారు.



# శుభ్రత శూన్యం

### సంప్‌ల క్లీనింగ్‌లో నిర్లక్ష్యం.. రిజర్వాయర్లు, ట్యాంక్‌ల వద్ద కుక్కల సంచారం,పావురాల తిష్ట

**హైదరాబాద్, అక్టోబరు 14 ప్రభాతవార్త**

నగవాసులకు తాగునీటిని సరఫరాచేసే రిజర్వాయర్ల శుభ్రతలేమి ఆందోళన కలిగిస్తోంది. రిజర్వాయర్ల క్లీనింగ్‌లో జలమండలి నిర్లక్ష్యం వహిస్తోందనే ఆరోపణలున్నాయి. ఒకవైపు ప్రతినిత్యం నీటి ప్రవాహంలో కలిసి వచ్చే ఒండ్రు మట్టి, ఇతరాత్రా వ్యర్థాలు పేరుకుపోవడం, మరోవైపు ట్యాంకుల చుట్టూ సరైన రక్షణ కవచం, మెయింటెన్ చేయక పోవడంతో అందులోని జలాలు ఎంత వరకు సురక్షితమన్న ప్రశ్న తలెత్తుతోంది. నిత్యం పలు రిజర్వాయర్ల వద్ద కుక్కలు స్వైరవిహారం, పావురాలు తిష్టవేయడం బెంబేలెత్తిస్తోంది. జలమండలి ప్రధాన జలాశయాల నుంచి రోజువారీగా నీటిని సర్వీస్ రిజర్వాయర్లకు తరలించి అక్కడి నుంచి పైపులైన్ల ద్వారా ఇంటింటికీ సరఫరా చేస్తోంది. కొన్ని రిజర్వాయర్లలోని వ్యర్థాలతో కలుషిత నీరు నల్లాల ద్వారా చేరుతూ ప్రజల అనారోగ్యానికి హేతువులుగా మారుతున్నాయి.

**అడుగు భాగంలో వ్యర్థాలు..**

ప్రధాన బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల క్లీనింగ్ దేవుడెరుగు..కనీసం చివరిగా నీటిని నిల్వచేసే సర్వీస్ రిజర్వాయర్ల క్లీనింగ్‌పై నిర్లక్ష్యమే కనిపిస్తోంది. బీఐఎస్ నిబంధనల ప్రకారం ప్రతి ఆరు నెలలకోసారి గ్రౌండ్‌లెవల్ సర్వీస్ రిజర్వాయర్, అండర్ లెవల్ సంప్‌లు, ట్యాంకులు తప్పనిసరిగా క్లీనింగ్ చేయాలి. అందులోని మొత్తం నీటిని ఖాళీ చేసి ఒండ్రు మట్టి,వ్యర్థాలను బయటికితీసి పూర్తిస్థాయిలో శుభ్రం చేయాలి. కనీసం ఏడాదికి ఒకసారి కూడా శుభ్రపర్చని పరిస్థితి దాపురించింది. దీంతో అడుగు భాగంలో పేరుకుపోయిన వ్యర్థాలతో సూక్ష్మక్రిములు, అభివృద్ధి చెంది నీటిని కలుషితం చేసి ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు.కొన్నిసార్లు అభివృద్ధి చెందిన క్రిములు పైపులైన్ల ద్వారా నల్లా నీరు కలుషితం కావడం ఆందోళన కలిగిస్తోంది. పాత బస్తీలో పలు ప్రాంతాలకు నీటిని సరఫరా చేసే అత్యంత పురాతన మిస్రిగంజ్ రిజర్వాయర్ దీర్ఘకాలికంగా క్లీనింగ్ జరగని పరిస్థితి నెలకొంది. ఈ రిజర్వాయర్ పరిధిలోని నల్లానీటిలో అప్పుడప్పుడు పురుగులు రావడం షరామామూలైంది.

పలు సర్వీస్ రిజర్వాయర్లు, సెక్షన్ల వద్ద భద్రత లేమి మరింత ఆందోళన గురిచేస్తోంది. ఫలితంగా కుక్కల సంచారం, ట్యాంకులో ప్రమాదాలు సాధారణంగా మారాయి. ఉదాహరణకు బోజగుట్ట, చిలకలగూడ, భోలక్‌పూర్, మిస్రిగంజ్, ఆటో నగర్, రెడ్‌హిల్స్, రాజేంద్రనగర్ టీచర్‌కాలనీ రిజర్వాయర్ల వద్ద కుక్కల స్వైర విహారానికి అడ్డూ అదుపూ లేకుండాపోయింది.నగర శివారు మున్సిపాలిటీల్లోని సంప్‌లు, రిజర్వాయర్ల పరిస్థితి మరీ దారుణంగాఉన్నాయని పలువురు పేర్కొంటున్నారు. బోడుప్పల్, లక్ష్మీనగర్‌కాలనీలోని భారీఅండర్‌గ్రౌండ్ ట్యాంకర్‌ను శుభ్రంచేయడం గాలికి వదిలేశారు.

# ఆ పేస్ట్..వరస్ట్..!



- అల్లం వెల్లుల్లి పేస్ట్ నుంచి ఆయిల్స్ దాకా కల్తీ
- సిటీ జనం.. అవసరం ఆసరాగా చెలరేగుతున్న కల్తీ ముఠాలు
- చెడిపోయిన పదార్థాలు, ప్రమాదకర రసాయనాలతో తయారీ
- పలుమార్లు భారీగా నకిలీ, కల్తీ సరుకులను పట్టుకున్న పోలీసులు
- నకిలీ పేస్ట్‌లతో ఆరోగ్య సమస్యల వస్తాయంటున్న వైద్యులు

**హైదరాబాద్, అక్టోబరు 14 ప్రభాతవార్త**

నిత్యావసర సరుకుల్లో దేనిలో చూసినా కల్తీలు, నకిలీలు రాజ్యమేలుతున్నాయి. కల్తీ లేకుండా దొరకాలంటే భూతద్దంపెట్టి వెతకాలేమో అనేలా మారిపోయిన సరుకుల్లో అల్లం వెల్లుల్లి పేస్ట్ ఒకటి. మార్కెట్‌లో లభించే అత్యధిక అల్లం వెల్లుల్లి పేస్ట్ కల్తీదే. నాసిరకం అల్లం, వెల్లుల్లీలను వాడటమే కాదు. ఉల్లి, దుంపలు, ఇతర పదార్థాలను కూడా కలుపుతున్నారు.ఈ మిశ్రమం డయేరియా, ఉదర కోశ వ్యాధులకు కారణమవుతోంది. అలాగే వీటిలో కలిపే సింథటిక్ పౌడర్, గమ్‌పౌడర్లు ప్రమాదకరం. ముఖ్యంగా అల్లం వెల్లుల్లి పేస్ట్, కారంపొడి, మసాలాలు, నూనెలు వంటివి విపరీతంగా కల్తీ అవుతున్నాయి. గ్రేటర్ నగరంలో ఉద్యోగాలు, పని ఒత్తిడితో రెడీమేడ్ సరుకులు కొనేవారి అవసరాన్ని ఆసరాగా తీసుకుని కల్తీముఠాలు చెలరేగిపోతున్నాయి. చెడిపోయిన,కుళ్లిపోయిన పదార్థాలను వాడటంతో పాటు వివిధ రకాల రసాయనాలు, ప్రమాదకర పదార్థాలు కలిపి కల్తీ దినుసులను మార్కెట్లోకి వదులుతున్నాయి. టాస్క్‌ఫోర్స్, ఎస్‌ఓటీ పోలీసులు దాడులు చేస్తున్న ప్రతిసారి భారీ మొత్తంలో ఇలాంటి నకిలీ, కల్తీ సరుకులు పట్టుబడుతూనే ఉన్నాయి. వీటివల్ల ఆరోగ్యానికి ప్రమాదకరమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అత్యధికంగా కల్తీ అవుతున్న సరుకుల్లో వంట నూనెలు ఒకటి. సన్ ఫ్లవర్, పామాయిల్ వంటి ఎక్కువగా వాడే నూనెలను జంతు కళేబరాల నుంచి తీసిన కొవ్వులతో కల్తీ చేసి విక్రయిస్తున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గతంలోనూ నగరంలో కల్తీ వంట నూనెలు పట్టుకున్న సంఘటనలు వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ కల్తీ నూనెల వల్ల కంటి జబ్బులు, గుండె జబ్బులు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. జనం ఒకప్పుడు ఎండు మిరపకాయలను కొని పొడి చేసుకునే వారు. కానీ ఇప్పుడు మార్కెట్‌లో నేరుగా కారం పొడి కొనుగోలు చేస్తున్నారు. ఈ కారంపొడి విపరీతంగా కల్తీ అవుతోంది. ఇటుకపొడి, పాడైన మిరియాలు, సున్నపుపొడి వంటి పాదర్థాలను కలుపుతున్నారు. కారంపొడి ఎర్రగా కనిపించేందుకు సుడాన్ డై అనే రసాయనాన్ని కలుపుతున్నారు. ఇది కేన్సర్ కారకమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అంతేకాదు.. కారంపొడిలో కలిసే కల్తీలతో డయేరియా, ఇతర అనారోగ్య సమస్యలూ వస్తాయని పేర్కొంటున్నారు.

**ప్రమాదకర పదార్థాలతో...**

కల్తీ ముఠాలు.. దినుసుల్లో కలుపుతున్న పదార్థాలు భయపెడుతున్నాయి. జంతువుల కళేబరాల నుంచి తీసిన కొవ్వుతో తయారైన మంచి నూనె, రంపపు పొడి, బోరిక్ పౌడరున్న కలిపిన మసాలా పౌడర్లు.. ప్రమాదకర రసాయనాలు కలిపిన మసాలాల విక్రయం సర్వసాధారణంగా మారింది. రాతిపొడి, పెయింట్ స్టెయినర్, మైదాపిండి వంటివి కలిపి నకిలీ గసగసాలు తయారు చేస్తున్నారు. అంతేకాదు పలు దినుసులలో సింథటిక్ పెయింట్లు కలుపుతున్నట్లు అధికారుల దాడుల్లో తేలింది. ఆ పెయింట్లలో ఉండే సీసం విషపూరితమని, రక్తంలో హిమోగ్లోబిన్‌ను తగ్గిస్తుందని, బరువు తగ్గడం, మలబద్ధకం, రక్తహీనత వంటి అనారోగ్య సమస్యలు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఆహార పదార్థాల కల్తీని నిరోధించేందుకు కల్తీకి పాల్పడినవారిని శిక్షించేందుకు ప్రత్యేక చట్టం ఉంది. కల్తీలు, నకిలీలకు పాల్పడినవారికి గరిష్టంగా ఆరు నెలలు జైలుశిక్ష, రూ. 10 లక్షల వరకు జరిమానాలు విధించే అవకాశం ఉంది. కానీ అది సరిగా అమలుకాని పరిస్థితి. దాడుల్లో కల్తీ, నకిలీ ఉత్పత్తులను పట్టుకుంటున్న అధికారులు.. గట్టి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

– నగర శివారులోని కాటేదాన్ పారిశ్రామికవాడలో నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్, మ్యాంగో కూల్ డ్రింక్ తయారు చేస్తున్న నకిలీ ముఠాను గతంలో సైబరాబాద్ కమిషనరేట్ పోలీసులు అరెస్టు చేశారు. కుళ్లిన అల్లం, వెల్లుల్లి, ఎసిటిక్ యాసిడ్ వంటి ప్రమాదకర రసాయనాలను ఉపయోగించి తయారు చేసిన సుమారు 500 కిలోల నకిలీ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

– ఇటీవల ఉప్పర్‌పల్లిలో ఓ గోడౌన్ మీద దాడి చేసిన పోలీసులు.. ఏకంగా 4 టన్నుల కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు. గతంలో నగర శివారు రాజేంద్రనగర్ పరిధిలోనూ కల్తీ అల్లం పేస్ట్‌ను పోలీసులు పట్టుకున్నారు. పేస్ట్ చిక్కగా ఉండేందుకు వీరు సింథటిక్ పౌడర్, గమ్ పౌడర్ వంటి ప్రమాదకర పదార్థాలను కలిపినట్టు గుర్తించారు.

– ఈ ఏడాది మే నెలలో కాటేదాన్‌లోని ఓ పరిశ్రమపై సైబరాబాద్ ఓస్‌ఓటి పోలీసులు దాడిచేసి, కుళ్లిపోయిన అల్లం, వెల్లుల్లితోపాటు ప్రమాదకర రసాయనాలు కలిపిన అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను పట్టుకున్నారు.

– పహాడీ షరీఫ్‌లో చెక్కపొడి, ఎండుటాకులు, కృత్రిమ రంగులను కలిపి కల్తీ గరం మసాలా తయారీ చేస్తూ, ప్రముఖ కంపెనీల లేబుళ్లతో విక్రయిస్తున్నవారిని అరెస్టు చేశారు.

– నకిలీ మసాలా ఉత్పత్తులను విక్రయిస్తున్న ఉత్తరప్రదేశ్ వాసిని నగరంలోని బేగంబజార్‌లో నిర్వహించిన దాడుల్లో పట్టుకున్నారు.

– నగరంలో విషపూరిత రసాయనాలతో కల్తీ చేసిన మసాలాలు భారీగా పట్టుబడ్డాయి. బొప్పాయి గింజలకు సింథటిక్ గమ్, ఐరన్ ఆక్సైడ్, మైదా పిండి, కొన్ని రసాయనాలు కలిపి మిరియాలుగా విక్రయిస్తున్నారు.

**కల్తీని తెలుసుకోవడం ఎలా...**

నకిలీ, కల్తీ సరుకుల విషయంలో మోసపోకుండా, వాటిని గుర్తించేందుకు ఏం చేయాలన్న దానిపై ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) తరచూ పలు సూచనలు చేస్తూ ఉంటుంది. వాటిని పాటిస్తే కల్తీల నుంచి మనం బయటపడవచ్చని నిపుణులు చెప్తున్నారు. వీలైనంత వరకు అల్ల వెల్లుల్లి పేస్ట్, మసాలాలు వంటివి ఇంట్లోనే తయారు చేసుకుంటే మేలు అని స్పష్టం చేస్తున్నారు. ఉదాహరణకు కారంపొడిని తీసుకుంటే..ఒక గ్లాసులో నీళ్లు తీసుకుని, అందులో ఒక చెంచాడు కారంపొడి వేయాలి. నీళ్లన్నీ రంగు కలిపినట్టుగా ఎర్రగా అయితే అది కల్తీయే. గ్లాసులో అడుగుకు చేరిన కారంపొడిని చేతిలోకి తీసుకుని రుద్ది చూడాలి. గరుకుగా అని పిస్తే ఇటుకపొడి కలిపి ఉందని అర్థం. కారంపొడి నీళ్లు సబ్బులా మృదువుగా అనిపిస్తే.. అందులో డిటర్జెంట్, యూరియా వంటివి కలిసి ఉండొచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

## భూ తగాదాలతో దాడి.. వ్యక్తి మృతి

**బేగంబజార్, అక్టోబరు 14 ప్రభాతవార్త:** భూ తగాదాలతో ముగ్గురు వ్యక్తులు మరో వ్యక్తిపై మూకుమ్మడిగా దాడిచేయడంతో మరణించిన సంఘటన మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్‌పరిధిలో చోటు చేసుకుంది.పోలీసుల కథనం ప్రకారం... లోయర్ దూల్‌పేట్ లాలా తాల్లిం ప్రాంతానికి చెందిన భజరంగ్‌సింగ్ (34), సత్యనారాయణసింగ్ (32), తుల్జారామ్‌సింగ్ (36), అదే ప్రాంతానికి చెందిన ఆర్.దుర్గేష్‌సింగ్(38) కొద్ది రోజుల నుంచి భూమి విషయంలో తగాదాలు నడుస్తున్నాయి. అయితే భజరంగ్‌సింగ్ దుర్గేష్‌సింగ్‌కు ఫోన్ చేసి పిలిపించారు. అక్కడి వెళ్లిన దుర్గేష్‌సింగ్‌కు, భజరంగ్ సింగ్,సత్యనారాయణసింగ్, తుల్జారామ్‌సింగ్‌లకు భూమి విషయంలో మాటా మాటా పెరిగింది. దీంతో కోపంతో ముగ్గురు వ్యక్తులు దాడి చేయడంతో దుర్గేష్‌సింగ్ సృహ్పతప్పి కింద పడిపోయాడు. అక్కడ ఉన్నవారు. దుర్గేష్‌సింగ్‌ను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రి తరలించారు. గాయాలకు గురైన దుర్గేష్‌ను ఉస్మానియా వైద్యులు పరీక్షించి మరణించినట్లు ధృవీకరించినట్లు పోలీసులు తెలిపారు. సుబాష్‌సింగ్ ఫిర్యాదు మేరకు మంగళ్‌హాట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

**గచ్చిబౌలి టిఎన్‌జిఓ కాలనీలో దొంగల కలకలం**

**గచ్చిబౌలి, అక్టోబరు 14 ప్రభాతవార్త :** గచ్చిబౌలి టిఎన్‌జిఓ కాలనీలో దొంగల సంచారం తీవ్ర కలకలం స ృష్టించింది. తుపాకులతో వచ్చిన దొంగలు అర్థరాత్రి సంచరించడం చూసిన స్థానికులు కేకలు వేయడంతో దొంగలు పారిపోయారని స్థానికులు తెలిపారు. కాగా ఈ విషయమై పోలీసులకు సమాచారం అందించామని స్థానికులు పేర్కొనగా, గచ్చిబౌలి పోలీసులు తమకు లిఖితపూర్వక ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఈ విషయమై గచ్చిబౌలి టిఎన్‌జిఓ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగయ్య మాట్లాడుతూ శనివారం అర్థరాత్రి 1 గంట ప్రాంతంలో ముసుగు ధరించిన ముగ్గురు దుండగులు కాలనీలోకి చొరబడ్డారని, ప్లాట్ నెంబర్లు 172,173,174ల వద్ద రెక్కీ నిర్వహించారన్నారు. ప్లాట్ నెంబరు 173లో ఇంటి కిటికీ లోపలికి తుపాకి గురిపెట్టి తలుపులు తీసేందుకు దుండగులు ప్రయత్నించడం పక్కనే ఉన్న ప్రైవేటు హాస్టల్ లోని యువకులు గుర్తించి కేకలు వేయడంతో స్థానికులు అప్రమత్తం కాగా, దొంగలు పారిపోయారని తెలిపారు. ముఖాలకు మాస్కులు ధరించి, ఇంటి వెనుక నుంచి దుండగులు రావడంతో గుర్తించలేకపోయామని, కాలనీలో సిసి కెమెరాలు సైతం పూర్తిస్థాయిలో లేవని అన్నారు. ఈ విషయమై వెంటనే డయల్ 100కు ఫోన్ చేసి పిర్యాదు చేశామని, గచ్చిబౌలి పోలీసులకు సైతం సమాచారం అందించామని అన్నారు. కాగా దొంగలు తుపాకులతో సంచరించినట్లు ఆధారాలు లేవని, ఈ విషయమై తమకు లిఖితపూర్వక పిర్యాదు రాలేదని గచ్చిబౌలి ఇన్స్‌పెక్టర్ వివరించారు.

## 19న సుద్దాల హనుమంతు జానకమ్మల జాతీయ పురస్కార ప్రదానోత్సవం

### -ఈ సంవత్సరం అరుణోదయ నాగన్నకు ప్రదానం

**చిక్కడపల్లి, అక్టోబరు 14 ప్రభాతవార్త:** సుద్దాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుద్దాల హనుమంతు జానకమ్మల జాతీయ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం 19న బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో నిర్వహించబోతున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు సుద్దాల అశోక్‌తేజ వివరించారు. సోమవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమం సమన్వయకర్త, ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఎన్.సోమయ్య, ఉపాధ్యక్షురాలు కె.సుజావతి, జి.బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సంవత్సరం హనుమంతు జానకమ్మల జాతీయ పురస్కారాన్ని అరుణోదయ నాగన్నకు ప్రదానం చేయబోతున్నట్లు వివరించారు. ప్రజాకవి సుద్దాల హనుమంతు జీవిత పర్యంతం పస్తులే ఆస్తిపాస్తులుగా నమ్మిన నిజమైన ప్రజాకవి అని అన్నారు. తుదిశ్వాస వరకు ఆఖరిపోరం ఆపని నిజాయితీ, నిబద్ధత కలిగిన ఆదర్శనీయ ప్రజాకవి అని అన్నారు. ఆ రోజు జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీమపాక నగేష్ హాజరవుతారని, ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్, కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు పాల్గొంటారని, సభకు సుద్దాల సుధాకర్ తేజ అధ్యక్షత వహిస్తారని, స్మారకోపన్యాసాన్ని డాక్టర్ పోరెడ్డి రంగయ్య నిర్వహిస్తారన్నారు. ఆత్మీయ అతిథులుగా యోచన, అందం వెంకటరెడ్డి, బి.బిక్షపతి బాల్యస్నేహితులను సత్కరించబోతున్నట్లు వివరించారు. తెలంగాణ బాలోత్సవం పిల్లలచే చక్కటి సాంస్కృతిక కార్యక్రమాలుంటాయన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సుద్దాల అశోక్‌తేజ

## హిందు దేవాలయాల ధ్వంసం వెనుక దాగి ఉన్న కుట్రను వెలికితీయాలి

### విశ్వహిందూ పరిషత్ డిమాండ్

**బేగంబజార్, అక్టోబరు 14 ప్రభాతవార్త:**

రెండు రోజుల క్రితం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో అమ్మవారి విగ్రహం ధ్వంసం చేసిన ఘటన మరువక ముందే సోమవారం తెల్లవారు జామున సికింద్రాబాద్ ప్రాంతంలో అమ్మవారి దేవాలయంలోని అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేయడం వెనుక దాగిన ఉన్న కుట్రను వెలికితీయాలని విశ్వహిందూ పరిషత్ అధికార ప్రతినిధి పగుడాకుల బాలస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొద్ది రోజుల నుంచి భాగ్యనగరంలో హిందువుల దేవాలయాల్లో అమ్మవారి విగ్రహాలను ధ్వంసం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మత సామరస్యాన్ని దెబ్బతీయడానికి ఇలాంటి కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. సంతోష్‌నగర్ రక్షపురంలోని అమ్మవారి దేవాలయాన్ని ఇద్దరు ఇతర మతస్థులు అకారణంగా ధ్వంసం చేశారన్నారు. కాని పోలీసులు మాత్రం వారికి మతిస్థితిమితం సరిగా లేదని కొట్టిపారేశారు. అదే విధంగా దసరా పండుగకు ఒక రోజు ముందు నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసినట్లు ఆరోపించారు. సికింద్రాబాద్ కుమ్మరివాడిలోని అమ్మ వారి దేవాలయంలో ఉన్న అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసినట్లు గుర్తు చేశారు. ఇవి అన్ని చూస్తే భాగ్యనగరంలో పెద్ద కుట్ర దాగి ఉన్నదని అనుమానం ఉందన్నారు. వెంటనే నిఘా సంస్థలు ఆ కుట్రలను వెలికితీయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో హిందువులతో కలిసి ఆందోళన చేస్తామని పగుడాకుల బాలస్వామి హెచ్చరించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

## విద్యారంగంపై సోషల్ మీడియా దుష్ప్రభావం

### టిఎస్‌యుటిఎఫ్ నేత నాగటి నారాయణ వర్ధంతి సభలో పలువురు వక్తలు

**ముషీరాబాద్, అక్టోబరు 14, ప్రభాతవార్త:** విద్యారంగంపై సోషల్ మీడియా తీవ్ర ప్రభావం చూపుతోందని, విద్యార్థులు దుష్ప్రభావంకు గురవుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం చెన్నుపాటి భవన్ టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో టీఎస్‌యూటీఎఫ్ సీనియర్ నాయకులు నాగటి నారాయణ ద్వితీయ వర్ధంతి సందర్భంగా విద్యారంగంపై మీడియా ప్రభావం అనే అంశంపై స్మారకోపన్యాయం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి మాట్లాడుతూ విలువలతో కూడిన విద్య స్థానంలో కార్పొరేట్ కల్చర్, డబ్బు ప్రభావం పెరిగిపోయి, మూఢత్వం, అశాస్త్రీయ ఆలోచనల భావజాలం పెరిగిపోతోందని, దీనిని ప్రభుత్వాలు అరికట్టకపోతే ఇది రాబోయే తరాలకు ప్రమాదకరంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో కంటెంట్ సైతం విపరీత ధోరణితో హింసను ప్రేరేపించే విధంగా ఉంటోందని, దీనివల్ల నేర ప్రవృత్తి పెరిగిపోతుందని అన్నారు. నాగటి నారాయణ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి హోదాలో 13 సంవత్సరాల పాటు ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడారని గుర్తు చేశారు. నాగటి నారాయణ ఆశయ సాధనలో టీఎస్‌యూటీఎఫ్ కార్యకర్తలు, నాయకులు నిరంతరం ఆందోళన-పోరాటాలు నిర్వహిస్తూ విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికై పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్షులు కే.జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి, నాయకులు టి.లక్ష్మారెడ్డి, పి.మాణిక్‌రెడ్డి, నరహరి, కృష్ణమూర్తి, రాజశేఖర్‌రెడ్డి, సోమశేఖర్, సింహాచలం, సైదులు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఓం పరంపర..

**నిజాంపేట్, అక్టోబరు 14, ప్రభాతవార్త:** శ్రీవిజయదుర్గ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఓం పరంపర వ్యవస్థాపకులైన శైలజ శిమ్మగారి ఆధ్వర్యంలో అష్టోత్తర శత కుండాత్మక భగవద్గీత అగ్నిహోత్రం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆధ్యాత్మిక జ్ఞానాన్ని భావితరాలకు అందించాలన్న సంకల్పంతో లోకహితార్థమై ఇలాంటి మహోన్నతమైన కార్యక్రమాన్ని అమ్మ అనుగ్రహంతో జరిపించుకోవడం ఎంతో ఆనందాన్ని ఇస్తుందని శైలజ అన్నారు. ఇటువంటి వినూత్నమైన ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకమైన తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు చేసుకున్నామని జ్యూరీ సభ్యుడు టి.వి.అశోక్‌కుమార్ తెలిపారు. రికార్డు నమోదు పత్రాన్ని ఓం పరంపర సంస్థ నిర్వాహకురాలు శైలజ శిమ్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ ఇన్స్‌పెక్టర్ జగదీష్, శ్రీరామ్ స్కూల్ డైరెక్టర్ శ్రీకాంత్, బివిఆర్‌ఐటి హైదరాబాద్ మహిళా ఇంజనీరింగ్ కాలేజీ ప్రొఫెసర్ డా.కె.కవిత, విశ్వగ్లోబల్ ఫౌండేషన్ సభ్యులు గంప సుధాకర్, దేవాలయం ధర్మకర్తలు సిహెచ్. సోమేశ్వర్, కె.ఎస్.వి.రామారావు, జి.రామస్వామి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. భగవద్గీతను బోధించడం, సామూహిక అగ్నిహోత్రం జరిపించడంపై హర్షం వ్యక్తం చేస్తూ, ప్రకృతికి, సమాజానికి ఉపయోగపడే ఇలాంటి మరిన్ని కార్యక్రమాలు ఈ సంస్థ ద్వారా జరగాలని వారు ఆకాంక్షించారు.



రికార్డు నమోదు పత్రంతో శైలజ శిమ్మ

## ప్రజావాణి సమస్యలను పరిష్కరిస్తాం

### రాజేంద్రనగర్ సర్కిల్ డిసి రవికుమార్

**అత్తాపూర్ అక్టోబరు 14,ప్రభాతవార్త :** ప్రజావాణి సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తున్నామని రాజేంద్రనగర్ సర్కిల్ డిసి రవి కుమార్ పేర్కొన్నారు. సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 2 ఫిర్యాదులను డిసి రవికుమార్ స్వీకరించారు. ఈ సందర్భంగా డిసి మాట్లాడుతూ.. ప్రజాసమస్యలను పరిష్కరించే దిశగా పనిచేస్తున్నామని ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరిస్తున్నామని తెలిపారు.ప్రతి ఒక్కరూ ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న డిసి రవికుమార్



హార్ట్ సింబల్‌తో ఐటికారిడార్‌పరిధిలో రెడ్‌సిగ్నల్స్

### గుండె జబ్బులపై అవగాహన పెంచుతూ

## ట్రాఫిక్ పోలీసుల వినూత్న ప్రయత్నం

### ట్రాఫిక్ రెడ్ సిగ్నల్ స్థానంలో 'హార్ట్ సింబల్'

**గచ్చిబౌలి, అక్టోబరు 14 ప్రభాతవార్త**

గుండె జబ్బులపై అవగాహన పెంచుతూ సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు వినూత్న ఆలోచనతో కార్యాచరణ ప్రారంభించారు. ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద రెడ్ సిగ్నల్ స్థానంలో హార్ట్ సింబల్‌ను ప్రదర్శిస్తూ వాహనదారుల్లో గుండె జబ్బులపై అవగాహన పెంచుతున్నారు. మొదటి విడతగా నానక్‌రాంగూడ ఔటర్ రింగురోడ్డు జంక్షన్‌లో ప్రారంభించిన ఈ ప్రయోగంపై వాహనదారుల నుంచి మంచి స్పందన రావడం, సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో ఐటి కారిడార్ పరిధిలోని మరిన్ని ప్రాంతాలకు విస్తరించారు. ప్రస్తుతం ఐటి కారిడార్ పరిధిలోని పలు ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద రెడ్ సిగ్నల్ పడి నిలిచిపోయిన వాహనదారులకు హార్ట్ సింబల్ దర్శనమిస్తుంది. కొంత కాలంగా హార్ట్ ఎటాక్‌లతో సంభవిస్తున్న మరణాల సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. యుక్త వయస్సులో ఉన్న యువత సైతం గుండెజబ్బులతో అకస్మికంగా మ ృతి చెందుతున్నారు. దీంతో గుండె జబ్బులపై అవగాహన కల్పిస్తూ వినూత్న క్యాంపెయిన్‌కు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు శ్రీకారం చుట్టారు.

జీహెచ్ఎంసీ, హెచ్ఎండిఏలతోపాటు ప్రైవేటు ఆసుపత్రుల సహకారంతో ఐటి కారిడార్ సిగ్నళ్ల వద్ద ఈ ప్రయత్నాన్ని అమలులోకి తీసుకువచ్చారు. ప్రస్తుతం ఐటి కారిడార్ పరిధిలోని పలు జంక్షన్లలో గ్రీన్, ఆరెంజ్ సిగ్నళ్లు సాధారంగా ఉంటుండగా, రెడ్‌సిగ్నల్ మాత్రం హార్ట్ సింబల్‌తో వస్తుంది. మొదట నానక్‌రాంగూడ ఔటర్ రింగురోడ్డు చౌరస్తాలో ప్రారంభించి, ప్రస్తుతం పలు ఐటికారిడార్‌లో మరిన్ని సిగ్నళ్లకు విస్తరించారు. రెడ్ సిగ్నల్‌తో వాహనాలు నిలిపి ఉంచుతున్న వాహనదారుల్లో కొద్దిసేపు గుండె జబ్బులపై ఆలోచించే విధంగా చేపట్టిన ఈ ప్రయత్నంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతుంది.



## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

**తలకొండపల్లి, అక్టోబరు 14, ప్రభాతవార్త** తలకొండపల్లి మండలం లింగారావుపల్లి గ్రామంలో బోచుపల్లి తిక్క జంగయ్య నిన్నరాత్రి 9.30సమయంలో అనారోగ్యంతో మరణించడం జరిగింది. ఈ వార్త తెలుసుకున్న పిఏసిఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి శతాబ్ది టౌన్షిప్ మేనేజింగ్ డైరెక్టర్ కాసు శ్రీనివాస్‌రెడ్డి దుగ్గుల బాల్‌రెడ్డి పోతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి పరదేపురం యాదయ్య సురేందర్ రెడ్డి తాజా మాజీ సర్పంచ్ తిరుప తయ్య అంజిరెడ్డి తదితరులు వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలయజేస్తూ తమ వంతు సహాయంగా శతాబ్ది టౌన్షిప్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీకాసు శ్రీనివాస్‌రెడ్డి 5000 పిఏసిఎస్ చైర్మన్ గడ్డ కేశవరెడ్డి 2000 పోతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి 2000 పరదేపురం యాదయ్య 1000 మొత్తంగాను 12వేల రూపాయలు వారి కుటుంబానికి ఆర్థిక సాయంగా అందిజేయడంజరిగింది.

ఉప్పల ట్రస్ట్ ద్వారా మూడువేల రూపాయల సాయం బిజెపి కార్య కర్తల ద్వారా మూడువేల రూపాయల ఆర్థి క సాయం అందజేశా రు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు బిజెపి నాయకులు కార్య కర్తలు పాల్గొన్నారు.

## పద్మశాలి నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం



**తలకొండపల్లి, అక్టోబరు 14, ప్రభాతవార్త** మండలంలోని చుక్కాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని చెన్నకేశవ స్వామి దేవాలయం ప్రాంగణంలో సోమవారం శ్రీభక్త మార్కండేయ పద్మశాలి సంఘం ఎన్నికలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుక్కుడాల మల్లేష్ ఉపాధ్యక్షులుగా ఏలె రమేష్ కాడిగే మధు పలాటి రాజ్‌కుమార్ ప్రధాన కార్యదర్శిగా కాడిగే నరేష్ కోశాధికారిగి మాకం గణేష్ సహాయ కార్యదర్శులుగా కాడిగే రాకేష్ కాడిగే శశికుమార్ ముఖ్య సలహాదారులుగా మాకం పాండయ్య మాకం జనార్దన్ మాకం వీరేశలింగం కాడిగే శివరాజు గౌరవ అధ్యక్షుడు కాడిగే చంద్రకుమార్ గౌరవ ఉపాధ్యక్షుడు ఏర్వ రాజలింగం మాకం నర్సింహులు కార్యవర్గ సభ్యులుగా మాకం రఘు కాడిగే రమేష్ రాజేష్ గాజుల ప్రవీణ్ ఏరువ నరేష్ మాకం ప్రమోద్ కడిగే శ్రీకాంత్ భీమనపల్లి కిషోర్‌కుమార్ కులస్తులందరూ పాల్గొన్నారు.

## కరుణించుమా కనకదుర్గమా!

**దుర్గామాత నిమజ్జనోత్సవంలో మాజీ ఎంపిటిసి కొమ్ము కృష్ణ**



**నందిగామ, అక్టోబరు 14, ప్రభాతవార్త:** శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గత తొమ్మిది రోజులుగా దేదీప్యమానంగా పూజలందుకున్న దుర్గమ్మ తల్లిని ఆదివారం రాత్రి అలంపూర్ జోగులాంట కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. నందిగామ మండలం కేంద్రంలోఉన్న గాంధీ చౌరస్తా శివాజీ యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన అమ్మవారిని కన్నుల పండువగా భక్తి శ్రద్ధలతో ఆటపాటల మధ్య ఊరేగింపు నిర్వహించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిటిసి సభ్యుడు కొమ్ము కృష్ణ మాట్లాడుతూ ఆదిపరాశక్తి అమ్మవారి కరుణాకటాక్షంతో ప్రజలందరినీ చల్లంగా చూడాలని వేడుకున్నారు. ఈ వేడుకల్లో శివాజీ వివేకానంద యూత్ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

నందిగామలో దుర్గామాత ఊరేగింపులో పాల్గొన్న మాజీ ఎంపిటిసి కొమ్ము కృష్ణ

## డబ్బుల విషయంలో ఘర్షణ వ్యక్తికి తీవ్రగాయాలు

**ధారూర్, అక్టోబరు 14, ప్రభాతవార్త:** డబ్బుల విషయంలో గొడవ పడి వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని కుక్కింద గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై వేణుగోపాల్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కుక్కింద గ్రామానికి చెందిన పకీరప్ప బోయ శ్రీనివాస్ శుక్రవారం డబ్బుల విషయంలో పాతకక్షలు మనసులో పెట్టుకుని గొడవపడ్డారు. శ్రీనివాస్ తలపై విచక్షరహితంగా పకీరప్ప కట్టెతో తలపై కొట్టాడు. తలకి తీవ్రమైన గాయం కావడంతో ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తరలించారు. చికిత్స అనంతరం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పకీరప్పపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

## ధాన్యంను దళారులకు అమ్మి మోసపోవద్దు

**-రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం**

**-గజ్వేల్ ఏఎంసి చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి**

**జగదేవ్‌పూర్, అక్టోబర్ 14 (ప్రభాతవార్త):**

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని చాట్లపల్లి గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.హనుమంతరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ప్రభుత్వాలు అందించని విధంగా రైతులు పండించిన సన్న వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేందాలనే సంకల్పంతో ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేసి రైతులకు అండగా నిలిచారని అన్నారు. రైతులు పండించిన వరి ధాన్యాన్ని గ్రామంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రంలో విక్రయించాలని, ఏ-గ్రేడ్ ధాన్యం క్వింటాల్‌కు ప్రభుత్వం రూ.2320 మద్దతు ధర అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మాజీ కొండపోచమ్మ చైర్మన్ బత్తుల మల్లేశం, మండల పంచాయతీ అధికారి ఎండి.ఖాజామొహినొద్దీన్, మండల వ్యవసాయాధికారి యు.వసంతరావు, ఏపిఎం కిరణ్, సిసి దేవరాజు, ఏఈఓ కృష్ణమూర్తి, మాజీ ఎంపిటిసి బరిగె సావిత్రి నర్సింలు, చాట్లపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు భూమల్ల మల్లయ్య, పానుగంటి రాజు, జనార్ధన్‌రెడ్డి, వరిమడ్ల బిక్షపతి, గడ్డం రాజు, చిలుముల నర్సింలు, రైతులు యాదగిరి, ఈదులు, కొండయ్య, వీవోఏలు గడ్డం రేణుక, వరిమడ్ల కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

## వలలో చిక్కుకుని మత్స్యకారుడు మృతి

**దుబ్బాక, అక్టోబర్ 14, ప్రభాతవార్త:** చేపల వేటకు వెళ్లి చేపల వలలో చిక్కుకుని మత్స్యకారుడు మృతి చెందిన సంఘటన దుబ్బాక పట్టణంలో జరిగింది. దుబ్బాక ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం ఉదయం చేపల వేటకు ఇంటి నుండి వెళ్లిన రమేష్(35) ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యుల దుబ్బాక పోలీస్ స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు వ్యక్తి మిస్సింగ్‌కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్న క్రమంలో దుంపలపల్లికి వెళ్లే మార్గంలో చెరువు గట్టుపై మోటర్ సైకిల్, చెప్పులు ఉండడంతో చెరువులో వెతుకగా మృత దేహం లభ్యమైంది. మృతుడు పెంటం రమేష్‌గా గుర్తించడం జరిగింది. మృతిని భార్య రూప ఫిర్యాదు మేరకు చేపల వేటకు వెళ్లి వలలో చిక్కుకుని మృతి చెందడం జరిగిందని కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టడం జరిగిందని దుబ్బాక ఎస్ఐ గంగరాజు తెలిపారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

## సైరన్ బిగించిన వాహన యజమానులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం : సీపీ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** అనుమతి లేకుండా సైరన్ బిగించిన వాహన యజమానులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సీపీ డా॥అనురాధ హెచ్చరించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా జిల్లాలో కొంత మంది వ్యక్తులు,ప్రజాప్రతినిధులు తమ తమ స్వంత వాహనాలకు పోలీసు సైరన్ ఏర్పాటు చేసుకున్న వాహనాలపై సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సైరన్స్ తీసివేశారు. ఈ సందర్భంగా సీపీ డా॥అనురాధ మాట్లాడుతూ స్పెషల్ డ్రైవ్‌లో 22 వాహనాలకు పోలీసు సైరన్ తీసివేయడం జరిగిందన్నారు. ఇంకా కొన్ని వాహనాలకు సైరన్ ఉన్నట్లు తెలుస్తుందని వెంటనే వాహనాల యజమానులు తీసివేయాలన్నారు. పోలీసు సైరన్‌ను తమ స్వలాభం కోసం వినియోగిస్తూ దుర్వినియోగం చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. పోలీసు సైరన్ పోలీసుశాఖ వాహనాలకు,అత్యవసర అంబులెన్స్‌లకు, ఎమ్మెల్యే,ఎంపి, వీఐపి, వీఐపీలకు మాత్రమే ఉంటుందన్నారు. సామాన్య ప్రజా ప్రతినిధులు కూడా పోలీసు సైరన్ బిగించుకొని ఇష్టం వచ్చినట్లు ప్రవరిస్తే సహించేదిలేదన్నారు. జిల్లాలోని కార్ డక్కర్ షాపు యజమాలు ఎవరైనా వచ్చి పోలీసు సైరన్ బిగించుమంటే బిగించొద్దన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా సైరన్ బిగించే షాపు యజమానులపై కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే చాలా మంది మోటార్ సైకిల్ వాహనాదారులు ప్రెస్,పోలీసు అని ముందు వెనకాల రాసుకొని జిల్లాలో తిరుగుతున్నారని త్వరలోనే స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసు అధికారులు సుమన్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, మురళి, వన్‌టౌన్, టూ టౌన్ సీఐలు ఉపేందర్,వాసుదేవరావు, కొమురవెల్లి ఎస్ఐ రాజు, కుకునూర్‌పల్లి ఎస్ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సీపీను కలిసి పూల మొక్కను అందజేసిన సీఐ



సీపీ డా॥అనురాధను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందిస్తున్న వన్‌టౌన్ సీఐ

**సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 14,ప్రభాతవార్త :** సిద్దిపేట వన్‌టౌన్ సీఐగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఎస్.వాసుదేవరావు సోమవారం సీపీ కార్యాలయంలో సీపీ డాక్టర్ అనురాధను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు. ఈ సందర్భంగా సీపీ డాక్టర్ అనురాధ సీఐని అభినందించి మాట్లాడారు. శాంతిభద్రతలకు పెద్దపీట వేస్తూ సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలకు ఎల్లవేళాల అందుబాటులో ఉంటూ సేవలు అందించాలన్నారు, గంజాయి,డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ, హెల్మెట్ వినియోగం, త్రిబుల్ రైడింగ్ తదితర అంశాలపై వాహనాదారులకు అవగాహన కల్పించాలన్నారు.

## మాజీ సర్పంచి దశ దిన కర్మలో ఎమ్మెల్యే



ధర్మగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే సునిత లక్ష్మారెడ్డి

**కొల్చారం, అక్టోబర్ 14 ప్రభాతవార్త:**

కొల్చారం మండల పరిధిలోని రంగంపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచి, ఎంపీటీసీ, రాజకీయ కురువృద్ధుడు గోకని ధర్మగౌడ్ గత 15 రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం ఆయన దశ దిన కార్యక్రమం రంగంపేట గ్రామంలో మాజీ ఎంపీటీసీ గోకని మాధవి రాజాగౌడ్ స్వగృహంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునితా రెడ్డి పాల్గొని ధర్మగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులు తాజా మాజీ ఎంపీటీసీ గోకని మాధవి రాజాగౌడ్‌లను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ అరిగే అరిగే రమేష్ కుమార్, మండల పార్టీ అధ్యక్షులు రాంపల్లి గౌరీశంకర్‌గుప్త, సీడీసీ మాజీ చైర్మన్ సూరెగొరి నరేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పాశం శ్రీనివాస్‌రెడ్డి, ముప్పిడి కృష్ణ, బీఆర్ఎస్ నాయకులు సాయిబాబా గౌడ్, చిట్యాల యాదయ్య, దొడ్ల ఆంజనేయులు, సోమ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గమ్మ తల్లి ఆశీస్సులు అందరికీ ఉండాలి

**-కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గాలి అనిల్ కుమార్**



**కొల్చారం, అక్టోబర్ 14 ప్రభాతవార్త:** దుర్గమ్మ తల్లి ఆశీస్సులు అందరికీ ఉండాలని, అమ్మవారి కృప కటాక్షాలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గాలి అనిల్ కుమార్ అమ్మవారిని కోరుకున్నారు. సోమవారం కొల్చారం మండల పరిధిలోని పోతంశెట్టిపల్లి గ్రామంలో పోచమ్మ గుడి దగ్గర ఏర్పాటు చేసిన దుర్గామాత నిమర్జనోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి గుమ్మడికాయ కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గాలి అనిల్ కుమార్ మాట్లాడుతూ ఆదిశక్తి, పరాశక్తి అయినటువంటి దుర్గామాతను నమ్ముకుంటే ప్రతిఒక్కరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో తలతూగుతారని అన్నారు. ఈ మిమర్జన కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచి గడ్డమీది నాగరాణి నర్సింలు, తాజా మాజీ ఎంపీటీసీ సాయిని భాగ్యలక్ష్మి సిద్ధిరాములు, ఏడుపాయ మాజీ డైరెక్టర్ యాదాగౌడ్, నాయకులు పుల్లబోయిన దుర్గేష్, గౌరీశంకర్, దయాకర్‌గౌడ్, రాములు, ఏగొండ, దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, యువకులు తదితరులు ఉన్నారు.



వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి చిత్రంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

## ఐకెపి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**మిరుదొడ్డి/తొగుట/బెజ్జంకి, అక్టోబర్ 14, ప్రభాతవార్త :**

రైతు రుణ మాఫీ పూర్తి స్థాయిలో కాలేదని రైతు భరోసా జాడేలేదని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మిరుదొడ్డి మండలం ధర్మారం, తొగుట మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి ప్రారంభించారు. బిఆర్ఎస్ పాలనలో రైతును రాజు చేసిన ఘనత మాజీ సిఎం కెసిఆర్‌కే దక్కుతుందన్నారు. కరువుతో విలవిలలాడిన దుబ్బాక నియోజకవర్గంలో గోదావరి జలాలు పారించి సస్యశ్యామలం చేసిన ఘనత కూడా కెసిఆర్‌దేనని తెలిపారు. బిఆర్ఎస్ పాలనలో 24 గంటల ఉచిత విద్యుత్, రైతు బంధు, రైతు బీమా అందించడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతులకు అడుగడుగున అన్యాయమే జరుగుతుందన్నారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొగుటలో నిర్వహించిన కార్యక్రమాలలో డీపీఎం రాజయ్య, ఎపిడి మధుసూదన్, తహాశీల్దార్ శ్రీకాంత్, ఎవో మోహన్, ఎపిఎం శ్రీనివాస్, మార్కెట్ కమిటీ కార్యదర్శి స్వామి, మహిళా సమైక్య అధ్యక్షురాలు వడ్ల మంజుల,రైతులు తదితరులు పాల్గొన్నారు.

**బెజ్జంకిలో..**



వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డా॥సత్యనారాయణ ఎమ్మెల్యేలు ప్రభాకర్‌రెడ్డి, డా॥సత్యనారాయణ

మండల కేంద్రంలో గల వ్యవసాయ మార్కెట్ కమిటీ,తోటపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సోమవారం స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దాన్యాన్ని అరబెట్టిన తర్వాతనే కొనుగోలు కేంద్రాలకు తీసుకవచ్చి మద్దతు ధరను పొందాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మహిళా శక్తిలో భాగంగా పేరుకబండ గ్రామంలో చిలుముల లక్ష్మీకి పిఎంఎఫ్ఎంఈ యూనిట్ ఫ్లోర్, మిని రైస్ మిల్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ తన్నీరు శరత్‌రావు, ఎఎంసి చైర్మన్ పులి కృష్ణ, ఎఎంసి వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్‌రెడ్డి, తహశీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిడిఓ ప్రవీణ్, ఎపిఎం నరసయ్య, సీసీలు సారయ్య, తిరుపతి,నాయకులు దామోదర్, రత్నాకర్‌రెడ్డి, శ్రావణ్, సంతోష్‌గౌడ్,శ్రీనివాస్, లింగాల శ్రీనివాస్, వీఓలు, మహిళా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గమ్మ లడ్డును దక్కించుకున్న సాయి చరణ్



**కొల్చారం, అక్టోబర్ 14 ప్రభాతవార్త:** కొల్చారం మండల పరిధిలోని రంగంపేట గ్రామలోని శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాత అమ్మవారి లడ్డు వేలంపాట నిర్వహించారు. వేలంపాటలో పాల్గొని సంగాయిపేట గ్రామానికి చెందిన ఎంఎస్ఆర్ యువసేన అధ్యక్షులు, స్వచ్ఛంద సేవా కార్యక్రమాల నిర్వాహకులు మన్నె సాయి చరణ్ 69 వేల రూపాయలకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా సాయి చరణ్ మాట్లాడుతూ అమ్మవారి కృప కటాక్షాలు యావత్తు తెలుగు ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు, ఎంఎస్ఆర్ యువసేన సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు పూరి గుడిసె దగ్ధం



**కొల్చారం, అక్టోబర్ 14 ప్రభాతవార్త:**

ప్రమాదవశాత్తు పూరి గుడిసె అగ్నికి ఆహుతి అయ్యింది. ఈ సంఘటన సోమవారం ఉదయం కొల్చారం గ్రామంలోని మంచినీళ్ల గండ్ల సమీపంలోని ఎస్సీ కాలనీలో చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో శివయ్యకు చెందిన పూరి గుడిసె దగ్ధమై బియ్యం, ధాన్యం, నగదుతో పాటు నిత్యావసర సరుకులు, బట్టలు దగ్ధం అయ్యాయి. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకొని డబుల్ బెడ్ రూం ఇల్లు మంజూరు చేయాలని స్థానిక ఎస్సీ కాలనీ వాసులు, ప్రజాప్రతినిధులు విజ్ఞప్తి చేస్తున్నారు. సంఘటన స్థలానికి కొల్చారం రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ ప్రభాకర్ చేరుకొని దగ్ధమైన గుడిసెను పంచనామా నిర్వహించి కాపీని పై అధికారులకు అందజేశామన్నారు.

## ఘనంగా దుర్గామాత శోభాయాత్ర

**జగదేవ్‌పూర్, అక్టోబర్ 14 (ప్రభాతవార్త):**

జగదేవ్‌పూర్ మండల పరిధిలోని చాట్లపల్లి గ్రామంలో శ్రీ దుర్గామాత అమ్మవారి శోభాయాత్రను ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పోతరాజుల వేషధారణతో నృత్యాలు చేస్తూ ప్రజలను ఆకర్షింపజేశారు. డప్పుచప్పుళ్లతో పోతరాజుల విన్యాసాలతో అమ్మవారి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారికి పూజలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు ప్రకాష్, భూమల్ల రాజు, ఈదులు, భూమల్ల స్వామి, చిట్కూరి కృష్ణ, మాసూరి భాస్కర్, వర్కొళ్ల కరుణాకర్, బుడిగె రమేష్, భూమల్ల నర్సింలు, బరిగె పర్శరాములు, కొయ్యాడ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయుల ఖాళీలను నింపాలి

**మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 14 ప్రభాతవార్త:**

బదిలీ పొంది రిలీవ్ కానీ సమయంలోనే ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయుల ఖాళీలను నింపాలని జిల్లా విద్యాశాఖ ఏడీ విజయకు పీఆర్టీయూ టీఎస్ నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సబ్జెక్ట్ టీచర్ లేని ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలో డీఎస్సీ-2024 ఉపాధ్యాయులను మొదటి ప్రాధాన్యతగా భర్తీ చేయాలని, సింగిల్ స్కూళ్లలో ట్రాన్స్‌ఫర్ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేస్తూ ఆ పాఠశాలల్లో నూతన ఉపాధ్యాయులతో భర్తీ చేయాలన్నారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా కాకుండా సాంక్షన్ పోస్ట్ ఆధారంగా ఉపాధ్యాయ పోస్టులను నింపాలని, ఆఫ్‌లైన్‌లో డీఎస్సీ-2024 కౌన్సిలింగ్ ప్రక్రియ చేపట్టాలని, రెండు పోస్టులకు సెలెక్ట్ అయిన ఉపాధ్యాయుల నుండి ఒక్క పోస్టుకు విల్లింగ్ లెటర్ తీసుకొని మిగిలిపోయిన మరొక పోస్టును తదుపరి వారితో నింపాలన్నారు. సాంకేతిక కారణాల వల్ల అవకాశం కోల్పోయిన అభ్యర్థులకు వారి సమస్యల పరిష్కారం అయ్యేవిధంగా చూడాలని జిల్లా విద్యాధికారికి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మల్లారెడ్డి జిల్లా అసోసియేట్ అధ్యక్షులు శ్రీనివాస్, సంగమేశ్వర్, మెదక్ మండల ప్రధాన కార్యదర్శి సంతోష్, రాష్ట్ర కార్యదర్శి విక్రాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ సభ్యత్వ నమోదును పూర్తి చేయాలి

**-ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్**



సమావేశంలో మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 14 ప్రభాతవార్త:**

ఈ రెండు రోజులు బీజేపీ సభ్యత్వ నమోదుకు పూర్తి సమయం ఇచ్చి సభ్యత్వాలను పూర్తి చేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ సూచించారు. సోమవారం మెదక్ పట్టణంలోని భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో బీజేపీ సభ్యత్వ నమోదుపై రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలో మెంబర్‌షిప్ తీరు పరిశీలించారు. ఈ. ఈ మీటింగ్‌లో జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, జిల్లా సభ్యత్వ ఇన్‌ఛార్జి డాక్టర్, మురళీధర్ గౌడ్, రాగి రాములు, జిల్లా జనరల్ సెక్రటరీ శ్రీనివాస్, రాజేందర్, రఘువీర్‌రెడ్డి, నందారెడ్డి, గడ్డం కాశీనాథ్, బండి సత్యనారాయణ, శ్రీనివాస్, సతీష్, రాజు, చంద్రశేఖర్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

## నూతనంగా బాధ్యతలు చేపట్టిన హైమావతి

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 14 ప్రభాతవార్త:**

మెదక్ జిల్లా సంక్షేమ అధికారిగా నియమితులైన జె. హైమావతి సోమవారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌కు పుష్పగుచ్ఛం అందించి మర్యాదపూర్వకంగా కలిసి బాధ్యతలు స్వీకరించారు. ఖమ్మం జిల్లా తొర్రూరు సీడీపీఓగా దాదాపు 6 సంవత్సరాలుగా పనిచేసిన హైమావతిని పదోన్నతి కల్పించి మెదక్ జిల్లా సంక్షేమ అధికారిగా ప్రభుత్వం నియమించింది. బాధ్యతలు స్వీకరించిన జిల్లా సంక్షేమ అధికారి హైమావతి మాట్లాడుతూ పదోన్నతి బాధ్యతను పెంచుతుందని, జిల్లా సంక్షేమ శాఖను అభివృద్ధి పథంలో నడిచే విధంగా ప్రణాళికబద్ధంగా సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో పనిచేస్తామని ఆమె తెలిపారు. గతంలో జిల్లా సంక్షేమ అధికారిగా పనిచేసిన బ్రహ్మాజీ విధుల నుండి రిలీవై సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు వెళ్లడం జరిగింది. పదోన్నతిపై మెదక్ జిల్లా సంక్షేమ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన హైమావతిని జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది అభినందనలు తెలిపారు.

## గంజాయి సాగు చేస్తున్న యువకుడి అరెస్టు

**-12 గంజాయి మొక్కల స్వాధీనం**

**వెల్దుర్తి, అక్టోబర్ 14 ప్రభాతవార్త:** వ్యవసాయ పంట పొలంలో గంజాయి మొక్కలను సాగు చేస్తున్న యువకుడిపై రామాయంపేట ఎక్సైజ్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. రామాయంపేట ఎక్సైజ్ సీఐ రాణి తెలిసిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కలాన్ శెట్టిపల్లి గ్రామానికి చెందిన ఎల్లబోయిన భూపాల్ గ్రామ శివారులోని లంబాడి తండా సమీపంలో ఉన్న తన స్వంత వ్యవసాయం పొలంలో గంజాయి మొక్కలను సాగుచేస్తున్నాడన్న విశ్వసనీయ సమాచారం మేరకు ఎక్సైజ్ ఎస్ఐ విజయ్ సిద్దార్థ్ తన సిబ్బందితో కలిసి దాడి చేసి 12 గంజాయి మొక్కలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు భూపాల్‌పై కేసు నమోదు చేసి ఎక్సైజ్ పోలీసులు వెల్దుర్తి ఎస్ఐ కృష్ణ దగ్గర బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ రాణి మాట్లాడుతూ యువత గంజాయి బారిన పడి భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని, గంజాయి మొక్కలను సాగు చేసే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## చెరువులో దూకి వ్యక్తి మృతి

**శివ్వంపేట,అక్టోబర్ 14 ( ప్రభాత వార్త)** చెరువులో దూకి వ్యక్తి మృతి చెందిన ఘటన శివ్వంపేట పోలీస్ స్టేషన్ పరిదిలో చోటచేసుకుంది. ఎస్సై మహిపాల్ రెడ్డి తేలిపిన వివరాల ప్రకారం పిల్లుట్ల గ్రామనికి చెందిన లెంకలా మల్లికర్జున్ (42) ఈనెల 12న మధ్యాహ్నం ఒకటి గంటలకు మద్యం తాగి ఇంటికి వచ్చి ఇంట్లో భార్యతో డబ్బులు ఇవ్వమని గోడవపడి ఇంటి నుండి

వెళ్లి పోయి మధ్యం మత్తులో ఆర్థిక ఇబ్బందులతో పిల్లుట్ల పెద్ద చెరు వులో దూకి చనిపోయాడు. మృ తుని భార్య లెంకలా మధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చె సి నట్లు ఎస్సై తెలిపారు.

## ప్రమాదవశాత్తు డ్రైనేజ్‌లో పడి వ్యక్తి మృతి

**దుబ్బాక, అక్టోబర్ 14, ప్రభాతవార్త:**మూత్ర విసర్జనకు వెళ్లి ప్రమాదవశాత్తు డ్రైనేజ్‌లో పడి మృతి చెందిన సంఘటన దుబ్బాక పట్టణ పరిధిలో టిటిడి కళ్యాణ మండపం వద్ద ఆదివారం జరిగింది. దుబ్బాక ఎస్ గంగరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దుబ్బాక పట్టణం లచ్చపేట వార్డుకు చెందిన పూస శంకర్(55) దుంపలపల్లి గ్రామంలో తమ తోటి అల్లుడి సంవత్సరికం ఆదివారం ఉండగా కుటుంబ సభ్యులైన భార్య, ఇద్దరు పిల్లలు శంకర్ కన్న ముందుగా దుంపలపల్లి గ్రామానికి వెళ్లారు. రాత్రి కావస్తున్న శంకర్ దుంపలపల్లికి రాకపోగా కుటుంబ సభ్యులు ఫోన్ చెయ్యగా స్విచ్ ఆఫ్ రావడంతో స్వగ్రామమైన లచ్చపేటలో ఉండచ్చు అనుకున్నారు. సోమవారం ఉదయం దుబ్బాక పట్టణంలో దుంపలపల్లి గ్రామానికి వెళ్లే దారిలో డ్రైనేజ్‌లో మృత దేహం కనిపించడంతో దుబ్బాక పోలీస్ సిబ్బందికి సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృత దేహం వివరాలను సేకరించి కుటుంబ సభ్యులు సమాచారం అందించారు. దుబ్బాక నుండి దుంపలపల్లి గ్రామానికి వెళ్లే క్రమంలో పట్టణంలో టిటిడి కళ్యాణ మండపం వద్ద తన సైకిల్‌ని ఆపి మూత్ర విసర్జన కోసం డ్రైనేజ్ వద్దకు వెళ్లగా ప్రమాదవశాత్తు మురికి నీటిలో పడి మృతి చెందడం జరిగింది. మృతుని భార్య రాధ ఫిర్యాదు మేరకు ప్రమాదవశాత్తు డ్రైనేజ్‌లో పడి మృతి చెందాడు అని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరిగిందని దుబ్బాక ఎస్ఐ గంగరాజు తెలిపారు.

## మరువెల్లిలో పిడుగు పడి పశువు మృతి

**అల్లాదుర్గం, అక్టోబరు 14, ప్రభాతవార్త:** ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షంతో పాటు పిడుగు పడటంతో ఒక పశువు మృతి చెందింది. సంగారెడ్డి జిల్లా వట్టిపల్లి మండలం మరవెల్లి గ్రామ శివారులో పంట చేను వద్ద ఉన్న పశువుపై సోమవారం సాయంత్రం పడుగు పడటంతో పశువు అక్కడిక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మరువెల్లి గ్రామానికి చెందిన చింతల గట్టు సంగన్న తనకు రెండు పశువులను తన పంట చేను వద్ద దూరం దూరంగా చెట్టుకు కట్టివేయ డంతో సోమవారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం తోపాటు పెద్ద ఎత్తున శబ్దంతో పిడుగు పడటంతో ఒక పశువు అక్కడిక్కడే మృతి చెందింది. తాను నష్టపోయిన పశువుకు ప్రభుత్వ పరంగా ఆదు కుని నిరుపేదనైన తనకు ఆర్థిక సాయం



అందేలా చూడాలని సంబంధిత అధికారులను రైతు సంఘన్న కోరారు.

## క్రీడలలో గెలుపోటములు సహజమే

**డిఎల్‌డిఏ మాజీ చైర్మెన్ పి.నారాయణ్‌రెడ్డి**



విన్నర్‌గా పెద్దేముల్ టీంకు బహుమతిని అందజేస్తున్న పి.ఎస్.ఆర్.సి,ఆర్,ఆర్

**పెద్దేముల్, అక్టోబరు 14, ప్రభాతవార్త:** క్రీడలలో గెలుపోటములు సహజమేనని డిఎల్‌డిఏ మాజీ చైర్మెన్ పి.నారాయన్‌రెడ్డి అన్నారు. సోమవారం పెద్దేముల్ మండల కేంద్రంలో చిట్టెపు రాఘవేందర్‌రెడ్డి అధ్వర్యంలో నిర్వహించిన చిట్టెపు ప్రకాష్‌రెడ్డి (సీపీఆర్) మెమోరియల్ క్రికెట్‌టోర్నమెంటు ఫైనల్‌లో గెలిచిన విజేతలకుబహుమతులను అంద జేశారు. మొదటి బహుమతి (విన్నర్) పెద్దేముల్ ఫ్రెండ్స్ లేవెన్ టీం (రూ.21 వేలు,కప్) రెండవ బహుమతి (రన్నర్) తట్టెపల్లి జనతా ఫ్రెండ్స్ లెవెన్ టీంలు (రూ.11వేలు,కప్) దక్కించుకున్నాయి. ఈ సందర్భంగా పి.నారాయన్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని అన్నారు. అంతేగాకుండా క్రీడలతో స్నేహ సంబంధాలు బలపడతాయని అన్నారు.కోటపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ ఎస్.నారాయన్‌రెడ్డి, సొసైటిచైర్మెన్ ద్యావరి విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా నాయకులు ఎన్.ఎల్లారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పెండ్యాల ప్రవీణ్ కుమార్ గుప్తా, జితేందర్‌రెడ్డి, పి.మహిపాల్‌రెడ్డి,డివై నర్సిములు, ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, ఇందూరు ప్రకాష్,నరేష్‌రెడ్డి,శిల్లి, ఆజంఖాన్,మాజీ యంపిటిసి విద్యాసాగర్, మాజీ సర్పంచ్‌లు ఎర్రబాలప్ప,కిషన్‌రావు, బుజ్జమ్మ, లక్ష్మణ్, నారాయన్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, పరియాద రవికాంత్,ఆర్గ నైజర్స్ బంగ్లరఘు, రవి కుమార్‌డ్డి, సిహెచ్ వెంకటేష్, తన్వీర్ పాల్గొన్నారు.

### ఆలయ ధర్మకర్తల మండలి ఏర్పాటుకు దరఖాస్తుల స్వీకరణ

**పెద్దేముల్, అక్టోబరు 14, ప్రభాతవార్త:** దేవాదాయ, ధర్మదాయశాఖ పెద్దేముల్ మండలం మంబాపూర్‌లోని మారుతి దేవాలయం, శ్రీ గోపాలక్రిష్ణ దేవాలయాల ధర్మకర్తల మండలి ఏర్పాటు (నూతన కమిటీల) కోసం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఈఓ ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఈఓ ప్రవీణ్ మాట్లాడుతూ నూతన కమిటి (ధర్మకర్తల మండలి) ఏర్పాటు చేయుటకు ఉప కమిషనర్ ఆదేశించినట్లు తెలిపారు. ఆసక్తికలవారు సహాయ కమిషనర్ రంగారెడ్డి జిల్లా కార్యాలయం బొగ్గులకుంట హైదారాబాద్ నందు సంప్రదించాలని కోరారు.

### రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జీల నిర్మాణం చేయించండి



ఎంపీ విశ్వేశరరెడ్డిని కలిసిన బీజేపీ నాయకులు

**నవాబుపేట అక్టోబరు 14 ప్రభాతవార్త:** మండల పరిధిలోని గుల్లాగూడ, మూబారక్‌పూర్‌ల వద్ద రైల్వే అండర్‌గ్రౌండ్ బ్రిడ్జీలను నిర్మాణం చేయించాలని ఎంపీ కొండా విశ్వేశరరెడ్డిని సోమవారం బీజేపీ నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. రైలు పట్టాలతో సౌకర్యంతో పాటు అదే రితీలో ప్రమాదం పొంచి ఉన్నదనివారు ఎంపీకి విన్నవించారు. మూబారక్ పూర్ గ్రామం పరిస్థితి ఘోరంగా ఉంటుందని వారు తెలిపారు. ఒక వైపు రైలుపట్టాలు మరోవైపు మూసినది ఉన్నదని దీంతో రవాణ పరంగా గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు వారు వివరించారు. మండల పరిధిలోని గేటువనంపల్లి వద్ద బ్రిడ్జీ నిర్మాణానికి నిధులు మంజూ రయ్యాయని మిగతవాటి కోసం కూడా నిధులు మంజూరు చేయించాలని వారు కోరారు. అందుకోసం తప్పకుండా కృషి చేస్తానాని ఎంపీ హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం, బీజేపీనాయకులు కృష్ణరెడ్డి, గాలయ్య, గోపాల్‌రెడ్డి, పాల్గొన్నారు.

### దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపిన ఘట్‌కేసర్ మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు



మాజీ ఎమ్మెల్యే ఎం సుధీర్‌రెడ్డిని కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపిన మున్సిపల్ చైర్‌పర్సన్ ఎం. పానవి జంగయ్యయాదవ్

**ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 14, ప్రభాత వార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎం. పావనిజంగయ్యతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే ఎం. సుధీర్‌రెడ్డితో పాటు మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జీ తోటకూర వజ్రేశ్ యాదవ్, ఘట్‌కేసర్ సీఐ పరశురాంలను కలిసి దసరా పండుగ శుభాకాంక్షాలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యేతో పాటు నియోజకవర్గ ఇంఛార్జీని వారి నివాసంలో కలిసి దసరా శుభాకాంక్షాలు తెలిపిన వారిలో అవుశాపూర్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు సల్మాన్‌ఖాన్, మున్సిపల్ నాయకులు కంచర్ల వెంకట్ రెడ్డి, డొంకెని బిక్షపతి గౌడ్, ఘట్‌కేసర్ మున్సిపల్ నాయకులు ఎం. ముత్యాల్ యాదవ్, పన్నాల మల్లారెడ్డి పాల్గొన్నారు.

### టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాజ్యసభ సభ్యుడికి సన్మానం



పీసీసీవర్కింగ్ ప్రెసిడెంట్,రాజ్యసభసభ్యులను కలిసిన షాద్‌నగర్ కాంగ్రెస్ నేతలు

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (అక్టోబరు 14) :** టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అంజన్ కుమార్ యాదవ్, రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్ కుమార్ యాదవ్‌లను షాద్‌నగర్ పట్టణ కాంగ్రెస్ నేతలు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారికి దసరా శుభాకాంక్షలు తెలియజేసి, శాలువ, పుష్ప గుచ్చాలతో సత్కరించారు. షాద్‌నగర్‌కు చెందిన సీనియర్ నాయకుడు గడ్డం శ్రీనివాస్ యాదవ్, టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ ముబారక్ అలీఖాన్, ఉన్నారు.

## ఈశ్వరప్ప బోరంచలో బిజెపి సభ్యత్వాల నమోదు

**మనూర్, అక్టోబరు 14, ప్రభాతవార్త:** మండలంలోని బోరంచ గ్రామంలో సోమవారం భారతీయ జనతా పార్టీ సభ్యత్వాలను అందచేశారు. పార్టీ మండల అధ్యక్షులు ఈశ్వరప్ప, మాజీ ఎంపిటిసి సభ్యులు రాములు ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రజలకు పార్టీ సభ్యత్వాలు అందచేశారు. కార్యక్రమంలో పార్టీ ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాయిరాం, మండల ప్రధాన కార్యదర్శి చాకలి అశోక్, ఉపాధ్యక్షులు నర్సింలు, యువకులు పాల్గొన్నారు.

### దేవాలయ నిర్మాణానికి 30 వేల విరాళం అందజేసిన మహేష్



నిర్మాణంలో ఉన్న సీతారామాంజనేయ స్వామి దేవాలయం

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (అక్టోబరు 14):** ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయ కాంప్లెక్స్ నిర్మాణానికి మొగిలిగిద్ద గ్రామానికి చెందిన కుమ్మరి మహేష్ 30 వేల రూపాయలను విరాళంగా అందజేశారు. ఆయన తండ్రి కుమ్మరి మల్లయ్య జ్ఞాపకార్థం ఇట్టి విరాళాన్ని అందించినట్లు కుమ్మరి మహేష్ తెలిపారు. ఈసందర్భంగా గ్రామస్థులు ఆయనను అభినందించారు.

## ఘనంగా అమ్మవారి నిమజ్జన కార్యక్రమం

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (అక్టోబరు 14) :** షాద్‌నగర్ పట్టణంలో దేవి నవరాత్రుల చేపట్టిన నిమజ్జన కార్యక్రమానికి పట్టణ బీఆర్ఎస్ యువ నాయకులు మహ్మద్ ఎజాస్ (అడ్డు), నందారం అశోక్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు డాకం మనీష్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిమజ్జన కార్యక్రమానికి వచ్చిన భక్తులు, చిన్నారులకు అమ్మవారి ఫొటో జ్ఞాపికలను అందజేశారు.



జ్ఞాపికలను అందజేస్తున్న అడ్డు, నందారం అశోక్ యాదవ్

### పోచారం మున్సిపల్ 8 వ వార్డు కౌన్సిలర్ బైరు హీమ మృతి

**ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 14, ప్రభాత వార్త:** పోచారం మున్సిపల్ 8 వ వార్డు కౌన్సిలర్ బైరా హీమ ( 52 ) అనారోగ్యంతో సోమవారం మృతి చెందిందని కుటుంబ సభ్యులు తెలిపారు. కొంత కాలంగా అనారోగ్యానికి గురైన కౌన్సిలర్ హీమ నగరంలోని ఓప్రైవేటు ఆస్పత్రిలో చేరి చికిత్సపొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. బైర హీమ పోచారం మున్సిపల్ 8వ వార్డు నుండి స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీచేసి మంచి మేజారిటీతో గెలుపొందారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత కౌన్సిలర్ హీమ భర్త బైరు అయిలయ్యతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరి అదే పార్టీలో కొనసాగుతున్నారు. కౌన్సిలర్ మృతితో రాజీవ్ గృహకల్ప కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. కౌన్సిలర్ మృతి పట్ల మున్సిపల్ చైర్మన్ బి. కొండల్ రెడ్డితో పాటు వైస్ చైర్మన్ రెడ్యానాయక్, పలువురు కౌన్సిలర్లు, ఆయా పార్టీల నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

### ఇన్‌స్పెక్టర్ పరశురాంకు కాంగ్రెస్ సన్మానం



సీఐ పరశురాంను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పావని జంగయ్యయాదవ్, ముత్యాలుయాదవ్

**ఘట్‌కేసర్, అక్టోబర్ 14, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన పి.పరశురాంను సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ సనా మ్మనం. పోలీస్‌స్టేషన్‌లో చైర్‌పర్సన్‌తో పాటు కాంగ్రెస్‌పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పూలమొక్కను అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలో శాంతి, భ ద్రతల పరిరక్షణకు ప్రజాప్రతినిధులు, నాయకులు సహకరించాలని ఈసందర్భంగా సీఐ కోరారు. ఈకార్యక్రమంలో ఘట్‌కేసర్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు మామిండ్ల ముత్యాలుయాదవ్, ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ, ఉపాధ్యక్షులు కొరుబోతు నాగరాజు, కోశాధికారి పి.శశిధరణ్, డీసీసీ కార్యదర్శి ఉల్లి అంజనేయులు, మాజీ వార్డుసభ్యులు బొంత వెంకటేశ్, మీసాల సుధాకర్‌రావు, ఎన్ఎస్‌యుఐ మేడ్చల్ నియోజకవర్గ అధ్యక్షులు చందుపట్ల సాయిచరణ్‌రెడ్డి, ఈడబ్ల్యుఎస్‌కాలనీ అధ్యక్షులు కేశవపట్నం అంజనేయులు, 2వ వార్డు కాంగ్రెస్ అధ్యక్షులు నార్ల మల్లేశ్‌యాదవ్, రాముునాయక్, ఫయిమ్ తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షం-విద్యుత్ సరఫరాకు అంతరాయం

**పుల్‌కల్, అక్టోబరు 14, ప్రభాతవార్త:** ఉమ్మడి పుల్‌కల్ మండలంలో సోమవారం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురియడంతో విద్యుత్ సరఫరాను విద్యుత్ అధికారులు నిలిపేశారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణ ప్రాంతాలకు వలస వెళ్లిన వారు స్వగ్రామాలకు చేరుకుని పండగు పసందుగా చేసుకుని తిరిగి పట్టణాలకు పయనమవుతున్న తరుణంలో భారీ వర్షం కురుస్తుండటంతో ప్రయాణీకులు తమ ప్రయాణాన్ని వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. భారీ వర్షానికి సంగారెడ్డి-అకోలా 162వ జాతీయ రహదారిపై వాహనాలు ఎక్కడివి అక్కడే ఆగిపోవడంతో ట్రాఫిక్ జామ్ అయింది. తాడ్దానిపల్లి గ్రామ శివారులో గల టోల్ ప్లాజా వద్ద ఒక్క సారిగా ద్విచక్ర వాహనాలు నిలిచిపోవడంతో చిన్న పిల్లలు అవస్థలకు గురికావాల్సి వచ్చింది. సుల్తాన్‌పూర్‌లో ఓ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహా హాజరైన అలయ్ బలయ్ కార్యక్రమం సందర్బంగా పలుమార్లు విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గింది.

**మండలంలో భారీ వర్షం**

**ఝరాసంగం, అక్టోబరు 14, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఝరా సంగంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురియడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం కష్టించి పండిస్తున్న పంటలు చేతికొస్తున్న తరుణంలో అకాల వర్షాలతో పంటలు నీటిపాలు అవుతుండటంతో రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.

## ఘనంగా మహంకాళి అమ్మవారి పల్లకిసేవ

**గజ్వేల్, అక్టోబర్ 14 (ప్రభాతవార్త):** గజ్వేల్ పట్టణంలోని మహంకాళి అమ్మవారి దేవాలయంలో సోమవారం అమ్మవారి పల్లకిసేవ మరియు పట్టాభిషేకం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు చాడ నందబాలశర్మ, ఆలయ అధ్యక్షుడు కాల్వ శ్రీధర్‌రావుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శరన్నవరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజుల నుండి మహంకాళి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. దసరా పండుగ రోజు రావణాసుర దహనం కార్యక్రమానికి సుమారు 20వేల మంది భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మహంకాళి అమ్మవారి దేవాలయం ప్రతిరోజు భక్తులతో కిటకిటలాడింది. సోమవారం పల్లకిసేవ, పట్టాభిషేకం కార్యక్రమంలో పాల్గొన్న వారిలో పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు తలకొక్కుల ప్రేమ్‌కుమార్, సాయి పంతులు, గుండు మల్లేశం, హనుమాండ్ల నాగరాజు, దుర్గం వేణు, అమర నాగేందర్, సంజయ్‌గుప్త, బెజుగామ రాము, కొండపాక శ్రీను, కొమురవెల్లి శంకరయ్య, నాయిని వెంకటేష్, సురేష్, మచ్చ శ్రీను, మురళి, వెంకట్‌రెడ్డి, సంతోష్ పాల్గొన్నారు.

## ఘనంగా దుర్గామాత శోభాయాత్ర

**జగదేవ్‌పూర్, అక్టోబర్ 14 (ప్రభాతవార్త):** జగదేవ్‌పూర్ మండల పరిధిలోని చాట్లపల్లి గ్రామంలో శ్రీ దుర్గామాత అమ్మవారి శోభాయాత్రను ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పోతరాజుల వేషధారణతో నృత్యాలు చేస్తూ ప్రజలను ఆకర్షింపజేశారు. డప్పుచప్పుళ్లతో పోతరాజుల విన్యాసాలతో అమ్మవారి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారికి పూజలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు ప్రకాష్, భూమల్ల రాజు, ఈదులు, భూమల్ల స్వామి, చిట్కూరి కృష్ణ, మాసూరి భాస్కర్, వర్కొళ్ల కరుణాకర్, బుడిగె రమేష్, భూమల్ల నర్సింలు, బరిగె పర్శరాములు, కొయ్యాడ కృష్ణ పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నాయకులు చిత్తశుద్ధితో పనిచేయండి

**నవాబుపేట అక్టోబరు 14 ప్రభాతవార్త :** మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని సోమవారం టీఆర్ఎస్ మండల నాయకులు మార్యద పూర్వకంగా కలిశారు.ఈ సందర్బంగా దసరా శుభాకాంక్షలు కూడా తెలిపారు. ఇటివలే నూతనంగా ఏర్పడిన పార్టీ నూతన కమిటీ సభ్యులను ఆమెతో పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నూతన కమిటీకి శుభాకాంక్షలుతెలిపారు. పార్టీ కోసం చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. ప్రజలతో మమేకమై పనిచేసినపుడే గుర్తింపు లభిస్తుందని ఆమె చెప్పారు. ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పథకాలు అందించే విషయంలో ఎప్పటి కప్పుడు గమనిస్తూ స్పందిచాలని చెప్పారు.

బీఆర్ఎస్ మండల గౌరవ అధ్యక్షుడు పట్లోళ్ళ భరత్‌రెడ్డి, కార్మిక విభాగం రాష్ట్ర కార్యర్శివిజయ్, ముఖ్యసలహదారు సయ్యద్‌గౌస్, మండల అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి, కార్యనిర్వాక అధ్యక్షులు శాంతకుమూర్, పురు షోత్తం, ప్రధాన కార్యదర్శి మహేశ్‌రెడ్డి, కార్యదర్శి అమరెందర్‌రెడ్డి, కార్యనిర్వహక కార్యదర్శి మానిక్‌రెడ్డి, కోశాదికారి నరేందర్‌రెడ్డి, ప్రచార కార్య దర్శి శేఖర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కావలి రాజు,ఉపాధ్యక్షుడు దశరత్, పాల్గొన్నారు.



మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డిని కలిసిన బీఆర్ఎస్ నాయకులు

# ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు చెల్లించాలి

**ఏఐఎస్ఎఫ్ షాద్‌నగర్ ఇంచార్జి ఆకాష్ నాయక్ డిమాండ్**

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (అక్టోబరు 14) :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు చెల్లించాలని ఏఐఎస్ఎఫ్ షాద్‌నగర్ ఇంచార్జి ఆకాష్ నాయక్ డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు వారి సిబ్బందికి జీతాలు చెల్లించడంలో, కళాశాల భవనాలకు అద్దెలు చెల్లించడంలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆకాష్‌నాయక్ తెలిపారు. గత మూడు సంవత్సరాలుగా ఫీజు బకాయిలు విడుదల కాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక డిగ్రీ కళాశాల యాజమాన్యాలు రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక బంద్ చేయనున్నట్లు ప్రకటించాయని, అయినా ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేసే వరకు కళాశాల యాజమాన్యాలు నిరవధికంగా బంద్ నిర్వహిస్తే విద్యార్థుల చదువుకు ఆటంకం ఏర్పడుతుందని, సెమిస్టర్‌ల నిర్వహణ ఆలస్యమవుతుందని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బకాయిల విడుదల చేయడంలో నిర్లక్ష్యం చేసిందని చెప్పిన రేవంత్ రెడ్డి అధికారంలోకి రాగానే ఫీజు బకాయిలు మొత్తం ఒకేసారి విడుదల చేస్తానని చెప్పారని, కానీ అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయలేదని విమర్శించారు. వెంటనే ప్రభుత్వం డిగ్రీ కళాశాల యాజమాన్యాలతో చర్చలు జరిపి, వారికి బకాయిలను విడుదల చేయాలని, లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఏఐఎస్ఎఫ్ షాద్‌నగర్ ఇంచార్జి ఆకాష్ నాయక్ హెచ్చరించారు.

### హరీష్‌రావును కలిసిన మున్సిపల్ చైర్మన్

**గజ్వేల్ టౌన్, అక్టోబర్ 14 (ప్రభాతవార్త):** మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్‌రావును సోమవారం గజ్వేల్ -ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి. రాజమౌళి మర్యాద పూర్వకంగా కలిశారు. దసరా పండుగను పురస్కరించుకొని హరీష్ రావుకుజమ్మిఇచ్చి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట సిద్దిపేట కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌సి. సంతోష్ తదితరులు ఉన్నారు.

### మున్నూరుకాపు సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

**అక్కన్నపేట, అక్టోబరు14, ప్రభాతవార్త :** మండలంలోని నందారం గ్రామ మున్నూరు కాపు సంఘం నూతనకార్యవర్గాన్ని సోమ వారంరోజున ఎన్నుకున్నారు.కమిటి గౌరవ సలహాదారులుగా మంగళారపు రాజయ్య ,కాసర్లగంగయ్య, వాసాల కనుకయ్య, చైర్మెన్‌గా వాసాల కిష్టయ్య, అధ్యక్షులుగా వాసాల రవి,ప్రధాన కార్యదర్శిగా మాదాసు బిక్ష పతి,కోశాధికారిగా వాసాల సుధాకర్, ఉపాధ్య క్షులుగా వాసాల శ్రీనివాస్, మాదాసు రాజు లను ఎన్నుకున్నారు. కార్యవర్గ ఎన్నిక అనంతరం నూతన సభ్యత్వాలను స్వీకరించారు.

# ధాన్యం ను దళారులకు అమ్మి మోసపోవద్దు

**రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం**

**-గజ్వేల్ ఏఎంసి చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి**

**జగదేవ్‌పూర్, అక్టోబర్ 14 (ప్రభాతవార్త):** రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని చాట్ల పల్లి గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.హనుమంతరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ప్రభుత్వాలు అందించని విధంగా రైతులు పండించిన సన్న వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేందాలనే సంకల్పంతో ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేసి రైతులకు అండగా నిలిచారని అన్నారు. రైతులు పండించిన వరి ధాన్యాన్ని గ్రామంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రంలో విక్రయించాలని, ఏ-గ్రేడ్ ధాన్యం క్వింటాల్‌కు ప్రభుత్వం రూ.2320 మద్దతు ధర అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్విని యోగం చేసుకోవాలన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మాజీ కొండపోచమ్మ చైర్మన్ బత్తుల మల్లేశం, మండల పంచాయతీ అధికారి ఎండి.ఖాజామొహినొద్దీన్, మండల వ్యవ సాయా ధికారి యు.వసంతరావు, ఏపిఎం కిరణ్, సిసి దేవరాజు, ఏఈఓ కృష్ణమూర్తి, మాజీ ఎంపిటిసి బరిగె సావిత్రి నర్సింలు, చాట్లపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు భూమల్ల మల్లయ్య, పానుగంటి రాజు, జనార్థన్‌రెడ్డి, వరిమడ్ల బిక్షపతి, గడ్డం రాజు, చిలుముల నర్సింలు, రైతులు యాదగిరి, ఈదులు, కొండయ్య, వీవోఏలు గడ్డం రేణుక, వరిమడ్ల కళ్యాణి పాల్గొన్నారు.



చాట్లవల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసి చైర్మన్ నరేందర్‌రెడ్డి

## అధికారులకు శుభాకాంక్షలు తెలిపిన పిఆర్‌టియు



డిఎస్‌పి రామ్మోహన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నూతనంగా ఎన్నికైన పిఆర్‌టియు రాష్ట్ర, జిల్లా బాధ్యులు

**జహీరాబాద్, అక్టోబరు 14, ప్రభాతవార్త:** జహీరాబాద్ డివిజన్ పరిధిలోని ఉపాధ్యాయులకు పిఆర్‌టియు రాష్ట్ర స్థాయిలో పదవులు దక్కడంతో సోమవానం పదవులు అందుకున్న బాధ్యులు పట్టణంలోని డివిజనల్ కార్యాలయాల్లో అధికారులను మర్యాద పూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన పిఆర్‌టియు నాయకులతో పరిచయాలు చేసుకున్నారు. పట్టణంలోని డిఎస్‌పి రామ్ మోహన్‌రెడ్డి, ఏటీఓ, ఎస్‌టిఓ కార్యాలయాల్లో ఎటిఓ శ్రీనివాస్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, ఎంఈఓ బస్వరాజ్, ఉప తహసీల్దార్, ఆర్‌డిఓ, మండల పరిషత్, మున్సిపల్, సూపరిండెంట్, టిపిఓ. ఎస్ఐ కాశీనాథ్‌లను మర్యాద పూర్వకంగా కలుసుకుని దసరా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పిఆర్‌టియు రాష్ట్ర, జిల్లా, డివిజన్, మండలాల నాయకులు డాక్టర్ తులసీ రాం రాథోడ్, డి శ్రీనివాస్, బాలయ్య, డి విఠల్, శివరాజ్, ఎస్ నాగయ్య, మల్లికార్జున్, శ్రీశైలం, తుకారం చౌహాన్, చంద్రు రాథోడ్, పాండయ్య, అర్జున్ చౌహాన్, దేవిసింగ్ రాథోడ్, శివరాజ్, గోపాల్, వెంకటేశం, గోవర్ధన్, రాజ్ కుమార్, కిషన్ చౌహాన్, థల్ సింగ్ రాథోడ్, మల్లన్న, నానసింగ్ రాథోడ్, శివకుమార్ పాల్గొన్నారు.

### మల్లన్నసాగర్ కాలనీలో కనీస సౌకర్యాలు కల్పించాలి

**-సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి**

**గజ్వేల్, అక్టోబర్ 14 (ప్రభాతవార్త):** మల్లన్నసాగర్ భూనిర్వాసితులకు కనీస సౌకర్యాలు, మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సిఐటియు సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం గజ్వేల్ పట్టణంలోని ఆయన స్వగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మల్లన్నసాగర్ ముంపు గ్రామాల ప్రజలు ఊరు, వాడ, ఎద్దు, వ్యవసాయం వదిలి ప్రాజెక్టు కోసం వారి భూములను త్యాగం చేసిన నిర్వాసితులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం వారి సౌకర్యాలను, వసతులను గాలికి వదిలేసిందని, ఈ ప్రభుత్వమైనా మల్లన్నసాగర్ బాధితులను ఆదుకోవాల్సిన కనీస బాధ్యత ఉందన్నారు. ఎనిమిది గ్రామాలు, ఆరు మదిర గ్రామాలు, సుమారు 11వేల జనాభా నివాసం ఉంటున్న మల్లన్నసాగర్ కాలనీకి స్మశానవాటిక లేకపోయిందన్నారు. మల్లన్నసాగర్ ముంపు గ్రామాల్లో ఎవరైనా చనిపోతే అక్కడ ఉన్న గుంటలలో, చెరువు కుంటలలో దహనం చేస్తున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం గ్రామానికి ఒక వైకుంఠధామం నిర్మించాలన్నారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం కావస్తున్నా నిర్వాసితులను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. నిర్వాసితుల గ్రామాల నుండి గజ్వేల్ పట్టణానికి బస్సు సౌకర్యం లేదని, ద్విచక్ర వాహనాలు, కాలినడకన, ఆటోల ద్వారా గజ్వేల్‌కు చేరుకుంటున్నారని, మల్లన్నసాగర్ కాలనీ వద్ద బస్టాండ్‌ను నిర్మించాలన్నారు. గజ్వేల్ ఎమ్మెల్యే, మాజీ సిఎం కెసిఆర్, పార్లమెంట్ సభ్యుడు రఘునందన్‌రావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నర్సారెడ్డిలు ఈ విషయంలో స్పందించి నిర్వాసితులకు పూర్తిస్థాయిలో ప్యాకేజీ వచ్చే విధంగా చూడాలని కోరారు.

### మృతురాలి కుటుంభానికి అర్థిక సహాయం అందజేత

**కొండపాక, అక్టోబర్ 14, ప్రభాతవార్త:** కొండపాక మండల కేంద్రానికి చెందిన జంజిరపు ఎల్లవ్వ ఇటివల్ల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసు కున్న కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా ఎస్సి సెల్ అధ్యక్షుడు కొమ్ము విజయ్ కుమార్ మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదర్చి తన సోదరుడు కొమ్ము మల్లేశం సహకరంతో రూ॥ 5 వేల అర్థిక సహాయం అందించారు. అనంతరం అయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మృతురాలి కుటుంభానికి అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టియూసి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ రవీందర్ గౌడ్, కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పర్శరాములు యాదవ్, అంబేద్కర్ సంఘం సీనియర్ నాయకులు మంత్రి రవీందర్, ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి కొమ్ము భాను, మాజీ వార్డు సభ్యులు జంజిరపు నర్సింలు, వెంకటరమణ, అరుట్ల నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

### కథల పోటీల్లో నగదు బహుమతికి ఎంపికైన విద్యార్థి

**కొండపాక, అక్టోబర్ 14, ప్రభాతవార్త:** కొండపాక బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి జి. హర్షవర్ధన్ మాచిరాల బాల సాహిత్య పీఠం వారు నిర్వహించిన కథల పోటీలల్లో ప్రోత్సహక బహుమతికి ఎంపికైనట్లు అ పాఠశాల ప్రధానోపాధ్యాయులు విఠల్ నాయక్ తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలకు కలిపి నిర్వహించిన ఈ పోటీలల్లో ప్రోత్సమక బహుమతికి ఎంపికైన విద్యార్థిని హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. నవంబర్‌లో 3వ తేదిన రవీంద్రభారతిలో నిర్వహించే సన్మాన కార్యక్రమంలో హర్షవర్ధన్‌కు నగదు బహుమతితో పాటు, ప్రశంస పత్రం, జ్ఞాపికను అందించడం జరుగుతుందని తెలిపారు.

### సిఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం

**కొండపాక, అక్టోబర్ 14, ప్రభాతవార్త :** సిఎంఅర్ఎఫ్ నిరుపేదలకు వరం లాంటి దని కొండపాక పిఎసిఎస్ డైరెక్టర్ భూర్గుల సురేందర్ అన్నారు. సోమవారం వెలికట్ట గ్రామానికి చెందిన ఎర్రబోయిన నర్సింలు, కెమ్మసారం జ్యోతికి సిఎంఅర ఎఫ్ చెక్కులను కొండపాక కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు వాసరి లింగరావుతో కలిసి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పోరేట్ అసుపత్రుల్లో ఖరీదైన వైద్యం చేయించుకున్న వారికి సిఎంఅర్ఎఫ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వైద్యం ఖర్చుల కోసం నిరుపేదలను అదుకోవడానికి ప్రభుత్వం అర్థికంగా అదుకుంటుందని తెలిపారు.

### కనుల పండుగవగా శివపార్వతుల కళ్యాణం

**పాపన్నపేట, అక్టోబరు 14, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బాచారంలోని శివాలయంలో సోమ వారం శివపార్వతుల కళ్యాణోత్సవం అంగ రంగ వైభవంగా నిర్వహిం చారు. కళ్యాణోత్సవ కార్యక్రమానికి బాచారం గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి కళ్యాణోత్సవంను కనులార వీక్షించారు. మాజీ సర్పంచ్ వెంకట రాములు, మాజీ ఉప సర్పంచ్ రాము గుప్తా, మాజీ ఎంపిపి అధ్యక్షులు సొంగ పవిత్ర దుర్గయ్య పాల్గొన్నారు.



## బోరంచలో బిజెపి సభ్యత్వాల నమోదు

**మనూర్, అక్టోబరు 14, ప్రభాతవార్త:** మండలంలోని బోరంచ గ్రామంలో సోమవారం భారతీయ జనతా పార్టీ సభ్యత్వాలను అందచేశారు. పార్టీ మండల అధ్యక్షులు ఈశ్వరప్ప, మాజీ ఎంపిటిసి సభ్యులు రాములు ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రజలకు పార్టీ సభ్యత్వాలు అందచేశారు. కార్యక్రమంలో పార్టీ ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాయిరాం, మండల ప్రధాన కార్యదర్శి చాకలి అశోక్, ఉపాధ్యక్షులు నర్సింలు, యువకులు పాల్గొన్నారు.